



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 51 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కడప మంగళవారం 28 అక్టోబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 51 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED :KADAPA TUE 28 OCTOBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kadapa, Narasarao Peta,Bapatla,Ongole,Visakhapatnam,Kakinada, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur





## విశాఖలో భారీ వర్షం.. చెరువులను తలపిస్తున్న రోడ్లు

మొంథా తుపాను ప్రభావంతో విశాఖ నగరంలో భారీ వర్షం కురుస్తోంది. పలు చోట్ల ఈదురుగాలులు వీస్తున్నాయి. కైలాసపురంలో గాలుల ప్రభావానికి చెట్లు విరిగిపడ్డాయి. పలు చోట్ల రోడ్లపైకి వరదనీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. చెట్లు, విద్యుత్ స్తంభాల కింద ఉండొద్దని జీవీఎంసీ అధికారులు ప్రజలను సూచించారు.



## ఏపీలో ఇప్పుడు హై అలర్ట్... కలసికట్టుగా ఎదుర్కొందాం



- మొంథా తుఫానుపై అప్రమత్తమైన ఏపీ ప్రభుత్వం
- జీరో క్యాజువాలిటీ లక్ష్యంతో సహాయక చర్యలు ముమ్మరం
- 19 జిల్లాల్లో 40 లక్షల మందిపై ప్రభావం అంచనా
- సురక్షిత ప్రాంతాలకు వేలాది మంది ప్రజల తరలింపు
- రంగంలోకి దిగిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు
- అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని ప్రజలకు మంత్రి లోకేశ్ విజ్ఞప్తి

పెన్ పవర్ డెస్క్:మొంథా తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా "జీరో క్యాజువాలిటీ" లక్ష్యంతో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టినట్లు ఐటీ, మానవ వనరులు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ప్రజల భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యత అని, ప్రభుత్వ యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉందని

వివరాలు 2లో..

## రష్యా నుంచి చమురు కొనుగోలు..
## ట్రంప్ ప్రభుత్వంపై జైశంకర్ ఆగ్రహం



- ఇంధన కొనుగోళ్ల విషయంలో ఒక్కోదేశం పట్ల అమెరికా ఒక్కో విధంగా వ్యవహరిస్తోందని విమర్శ
- నీతులు చెప్పేవారు భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శ
- ఆసియాన్ సదస్సులో జైశంకర్ వ్యాఖ్యలు

వివరాలు 2లో..

# మొంథా తుపానుపై సీఎం చంద్రబాబు సమీక్ష..

## ప్రధాని మోదీ ఫోన్, యంత్రాంగానికి కీలక ఆదేశాలు

- మొంథా తుపానుపై సచివాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష
- సీఎంకు ఫోన్ చేసి వివరాలు అడిగిన ప్రధాని మోదీ
- కాకినాడకు 680 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైన తుపాను
- రాత్రికి తీరం దాటే అవకాశం ఉందని అంచనా
- కృష్ణా జిల్లాకు అతి భారీ వర్ష సూచన
- పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:మొంథా తుపాను ముంచుకొస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. సీఎం చంద్రబాబు సచివాలయంలోని ఆర్టీజీఎస్ (రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ) కేంద్రం నుంచి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ కూడా చంద్రబాబుకు ఫోన్ చేసి తుపాను పరిస్థితిపై ఆరా తీశారు.ప్రస్తుతం మొంథా తుపాను కాకినాడకు 680 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని అధికారులు సీఎంకు వివరించారు. గంటకు 16 కిలోమీటర్ల వేగంతో ఇది తీరం వైపు కదులుతోందని, రేపు రాత్రికి తీరాన్ని తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు.

తుపాను ప్రభావంతో ఈరోజు, రేపు కృష్ణా జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, పల్నాడు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రతీ గంటకు తుపాను కదలికలను గమనిస్తూ, వర్షాలు, వరదలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పంట నష్టం జరగకుండా

వివరాలు 2లో..

## తుపాను సందట్లో దొంగల బెడద లేకుండా చూడాలి



- మొంథా తుపానుపై కాకినాడ జిల్లా అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమీక్ష
- తీరం దాటనున్న నేపథ్యంలో 12 మండలాల యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ప్రభుత్వం
- ప్రాణ నష్టం నివారణే లక్ష్యంగా ముందస్తు చర్యలు చేపట్టాలని కీలక ఆదేశాలు
- గర్భిణులు, వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్పష్టమైన సూచనలు
- పునరావాస కేంద్రాల్లో ఆహారం, మందులు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం
- తుపాను సహాయక చర్యల కోసం కాకినాడకు రూ. కోటి అత్యవసర నిధి విడుదల

వివరాలు 2లో..

## 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్..




- 'ఎస్ఐఆర్'పై కేంద్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన
- బీహార్‌లో ఎస్ఐఆర్ విజయవంతమైందన్న ప్రధాన ఎన్నికల కమిషనర్
- రెండో దశలో 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నిర్వహిస్తామని వెల్లడి
- 21 ఏళ్ల కింద ఓటర్ల జాబితా సవరణ జరిగిందన్న జ్ఞానేశ్ కుమార్

పెన్ పవర్ డెస్క్:ఎస్ఐఆర్ ప్రత్యేక సమగ్ర సవరణ)పై కేంద్ర ఎన్ని కల సంఘం సోమవారం కీలక ప్రకటన చేసింది. బీహార్‌లో

వివరాలు 2లో..

## తుపానుపై సంచలన థంబ్ నెయిల్స్, హెడ్డింగ్‌లతో భయభ్రాంతులకు గురిచేయొద్దు



- మొంథా తుపాను నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తి సన్నద్ధం
- తుపాను వార్తలపై సోషల్ మీడియా, డిజిటల్ మీడియా సంయమనం పాటించాలన్న అనిత
- తప్పుడు థంబ్‌నెయిల్స్‌తో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయొద్దని స్పష్టం
- సంచలన హెడ్డింగులతో గందరగోళం సృష్టించడం చట్టవిరుద్ధమని వెల్లడి

వివరాలు 2లో..


## విజయవాడ కనకదుర్గమ్మ సాక్షిగా సత్యప్రమాణం చేసిన జోగి రమేశ్.. చంద్రబాబు, లోకేశ్‌కు సవాల్



- నకిలీ మద్యం కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని జోగి రమేశ్ స్పష్టీకరణ
- కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వచ్చిన మాజీ మంత్రి
- లైడిటెక్టర్, నార్కో అనాలసిస్ టెస్టులకు తాను సిద్ధమని ప్రకటన
- తన వ్యక్తిత్వాన్ని హననం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపణ
- తనపై తప్పుడు ఆరోపణలు చేసిన వారు సత్యప్రమాణానికి సిద్ధమా? అని సవాల్

వివరాలు 2లో..

## 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీం సీరియస్...
## అన్ని రాష్ట్రాలకు నోటీసులు



- 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీంకోర్టు సుమోటో విచారణ
- అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ
- మోసాలకు సంబంధించిన ఎఫ్ఐఆర్ వివరాలు సమర్పించాలని ఆదేశం
- ఇది దేశవ్యాప్త కుంభకోణం.. దర్యాప్తు సీబీఐకి అప్పగించేందుకు మొగ్గు
- ఈ మోసాల వెనుక మయన్మార్, థాయ్‌లాండ్ ముఠాలు ఉన్నాయని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న 'డిజిటల్ అరెస్ట్' మోసా లపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. పోలీసులు, న్యాయాధికారులమంటూ నకిలీ కోర్టు పత్రాలతో పౌరులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న మోసాలపై దాఖలైన కేసును సుమోటోగా విచారణకు స్వీకరించిన అత్యున్నత న్యాయస్థానం, సోమవారం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది.జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు విచారణ చేపట్టింది.

వివరాలు 2లో..


## ఏం.. మీరు న్యూస్ పేపర్లు చదవడంలేదా?... వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు ఫైర్

- వీధి కుక్కల నియంత్రణపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం
- ఆదేశాలు పాటించని రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలకు సమన్లు
- పశ్చిమ బెంగాల్, తెలంగాణ ప్రభుత్వాలకు మినహాయింపు
- నవంబర్ 3న కోర్టుకు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశం
- దేశ ప్రతిష్ట దెబ్బతింటోందని ధర్మాసనం కీలక వ్యాఖ్య
- హాజరు కాకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:వీధి కుక్కల నియంత్రణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీన వైఖరిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తాము జారీ చేసిన ఆదేశాలను పాటిం చడంలో విఫలమైనందుకు పశ్చిమ బెంగాల్, తెలంగా ణ మినహా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలకు (ప్రధాన కార్యదర్శులు) సమన్లు జారీ చేసింది. వారంతా నవంబర్ 3న తమ ఎదుట వ్యక్తిగతంగా

వివరాలు 2లో..



## ఏపీలో రైల్వే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

- ఏపీ రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- రాష్ట్రవ్యాప్తంగా రూ.33,630 కోట్ల విలువైన పనులు
- నడికుడి-శ్రీకాళహస్తి, గుంటూరు-గుంతకల్ పనుల పురోగతిపై చర్చ
- అమృత్ భారత్ స్టేషన్ల అభివృద్ధి, కొత్త లైన్ల ప్రతిపాదనల ప్రస్తావన
- సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి, రైల్వే ఉన్నతాధికారులు

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల పనుల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబా బు సోమవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం రూ.33,630 కోట్ల విలువైన రైల్వే పనులు వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు

వివరాలు 2లో..

## గెలిస్తే అనుమానం వస్తుందని బీహార్‌లో బీజేపీ గెలవదు



- బీజేపీ బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీని గెలిపిస్తుందన్న పాల్
- ఈవీఎం ఉన్నంత వరకు బీజేపీయే అధికారంలో ఉంటుందని వ్యాఖ్య
- బ్యాలెట్ విధానం కోసం తాము పోరాడుతున్నామన్న కేఏ పాల్

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# దటీజ్ చంద్రబాబు
# 70ఏళ్ల వయస్సులో చాలెంజ్

10 సంవత్సరాల వయసులో ఉన్న ఉత్సాహం 20 సంవత్సరాల వయసులో ఉండదు. ఇలా వయసు మారుతున్న కొద్దీ మనుషులలో మార్పులు వస్తుంటాయి. ఇది సహజంగా జరిగే ప్రక్రియే. కానీ కొంతమంది వయసు వెనక్కి పంపించేస్తుంటారు. తమ ఉత్సాహం ముందు.. తమ క్రమశిక్షణమందు వయసును చిన్నబోయేలా చేస్తారు. అటువంటి వారిలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒకరు. వాస్తవానికి ఈ జాబితాలో చంద్రబాబు నాయుడు కు మొదటి స్థానం ఇవ్వాల్సి ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో పెట్టుబడుల కోసం నాడు చంద్రబాబు నాయుడు అనేక దేశాలు తిరిగారు. మైక్రోసాఫ్ట్ అనే సంస్థను హైదరాబాద్ తీసుకొచ్చారు. మైక్రోసాఫ్ట్ ద్వారా ఐటీకి ఒక ఎకో సిస్టం డెవలప్ చేశారు. ఈరోజు హైదరాబాద్ ఐటి విభాగంలో ఈ స్థాయిలో అభివృద్ధి చెందడానికి ప్రధాన కారణం చంద్రబాబు నాయుడు అనడంలో ఎటువంటి అనుమానం అక్కర్లేదు. ఈ విషయాన్ని అనేకమంది ముఖ్యమంత్రులు.. అనేకమంది నాయకులు ఒప్పుకున్నారు. చంద్రబాబు నాయుడు మొదటినుంచి కూడా ఆహారం తీసుకునే విషయంలో కట్టుదిట్టంగా ఉంటారు. ఏమాత్రం దానిని బ్రేక్ చేయరు. ఆయనకు ఎంతో కాలం నుంచి మధుమేహం ఉంది. అయినప్పటికీ అయినప్పటికీ దానిని నియంత్రణలో ఉంచుకుంటున్నారు. చంద్రబాబు ఎట్టి పరిస్థితుల్లో కూడా అన్నం తినరు. కేవలం తృణధాన్యాలను మాత్రమే ఆహారంగా తీసుకుంటారు. కాఫీ తాగుతారు. గ్రిల్డ్ ఫిష్ తీసుకుంటారు. నాన్ వెజ్ విషయంలో ఆయనకు చాలా లెక్కలు ఉంటాయి. ప్రతిరోజు ఉదయం వ్యాయామం చేస్తారు. యోగా చేస్తారు. మెడిటేషన్ కూడా చేస్తారు. అందువల్ల చంద్రబాబు ఏడుపదుల వయసు దాటినప్పటికీ కూడా ఉత్సాహంగా కనిపిస్తుంటారు. ప్రతి విషయాన్ని కూడా గుర్తుంచుకుంటారు. ఆ విషయాన్ని చెప్పడానికి ఏమాత్రం సంకోసించరు. చంద్రబాబు ప్రస్తుతం విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు. అమరావతి ప్రాంతంలో రాజధాని నిర్మించడానికి వేగంగా అడుగులు వేస్తున్నారు. కేంద్రంలో అనుకూలమైన ప్రభుత్వం ఉన్నప్పటికీ చంద్రబాబు స్వీయ శక్తిని నమ్ముకుని ముందుకు వెళ్తున్నారు. ఈ వయసులో కూడా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రాంతంలో అనేక దేశాలను తిరిగివచ్చారు. అమరావతి ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న పెట్టుబడుల సదస్సుకు రావాలని అక్కడి కంపెనీల అధిపతులను కోరారు. అక్కడి ప్రభుత్వ అధినేతలను విన్నవించారు. అమరావతిలో భారీగా విదేశీ సంస్థలను తమ కార్యకలాపాలు ప్రారంభించే దిశగా చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకరకంగా ఇది సానుకూల అంశం. ఏపీ రాష్ట్రానికి మరింత సానుకూల అంశం. రాజకీయాల విషయాలను పక్కన పెడితే చంద్రబాబు ఈ వయసులో కూడా అక్కడికి వెళ్లడం ఒకరకంగా అద్భుతం అని చెప్పాలి. ప్రత్యేకమైన విమానాలు ఉన్నప్పటికీ.. అనేక రకాల సౌకర్యాలు ఉన్నప్పటికీ ఈ వయసులో ఆయన అక్కడికి వెళ్లడం మిరాకిల్ అనడంలో ఎటువంటి సందేహం లేదు. కొన్ని రాష్ట్రాలలో చంద్రబాబు కంటే తక్కువ వయసు ఉన్నవారు.. చంద్రబాబుతో సమానంగా వయసు ఉన్నవారు.. చంద్రబాబు కంటే ఎక్కువ వయసు ఉన్నవారు ముఖ్యమంత్రులుగా పనిచేస్తున్నారు. కానీ చంద్రబాబు మాదిరిగా ఎవరూ పెట్టుబడుల కోసం ఇతర దేశాలకు వెళ్లడం లేదు. ఇతర దేశాల కంపెనీల ప్రతినిధులను ఒప్పించడం లేదు. అన్నింటికంటే ముఖ్యంగా రాష్ట్ర అభివృద్ధి విషయంలో అహర్నిశలు శ్రమించడం లేదు. సాధారణంగా ఒక వయసుకు వచ్చిన తర్వాత చాలామంది ఉత్సాహంగా పనిచేయలేరు. ముఖ్యంగా 70 సంవత్సరాల వయసు దాటిన తర్వాత చాలామంది రిలాక్స్ అవ్వాలని కోరుకుంటారు. వయసు వల్ల వచ్చిన నీరసం కూడా ఇబ్బంది పెడుతూ ఉంటుంది. కానీ చంద్రబాబుకు అలసట అనేది తెలియడం లేదు. నీరసమనేది దరిచేరడం లేదు. ఈ వయసులో కూడా ఆయన ఎంతో ఉత్సాహంగా పనిచేస్తున్నారు. తన కలల రాజధాని కోసం విపరీతంగా శ్రమిస్తున్నారు. కేంద్రం నుంచి మొదలుపెడితే విదేశాల వరకు ఆయన అన్ని తలుపులను కూడా తడుతున్నారు. ఉజ్వలమైన ఏపీ కోసం బలమైన అడుగులు వేస్తున్నారు. ఒక నాయకుడు అనే వాడు బలమైన సామర్థ్యాన్ని కలిగి ఉండాలి. దృఢమైన ఆలోచనలను అమలు చేయాలి. అప్పుడే ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుంది. ఇప్పుడు చంద్రబాబు చేస్తోంది కూడా అదే.

## ఏం.. మీరు న్యూస్ పేపర్లు చదవడంలేదా?...
## వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు ఫైర్

- మొదటి పేజి తరువాయి

హాజరు కావాలని సోమవారం ఆదేశించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) రూల్స్, 2023 అమలుపై తీసుకున్న చర్యలను వివరిస్తూ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఈ ఏడాది ఆగస్టులోనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, చాలా రాష్ట్రాలు పట్టించుకోకపోవడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. "అధికారులు వార్తాపత్రికలు చదవడం లేదా? సోషల్ మీడియా చూడటం లేదా? ఆదేశాలు అందకపోయినా, అఫిడవిట్లు ఇక్కడ ఉండాల్సింది. నవంబర్ 3న చీఫ్ సెక్రటరీలందరూ తప్పనిసరిగా కోర్టులో హాజరు కావాలి" అని జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని బెంచ్ వ్యాఖ్యానించింది. పశ్చిమ బెంగాల్, తెలంగాణ ప్రభుత్వాలతో పాటు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) మాత్రమే అఫిడవిట్లు దాఖలు చేశాయని కోర్టు గుర్తించింది. "దేశంలో వీధి కుక్కలకు సంబంధించిన ఘటనలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. దీనివల్ల విదేశాల దృష్టిలో మన దేశ ప్రతిష్ఠ దెబ్బతింటోంది. మేం కూడా వార్తా కథనాలను చదువుతున్నాం" అని ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది. ఇదే సమయంలో, ఈ కేసులో తమను కూడా భాగస్వాములను చేయాలని కోరుతూ వివిధ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు (%=ఔా%), వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్లపై కూడా కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. "దేశంలోని %=ఔా%లన్నీ ఈ కేసులో పార్టీలుగా చేరతామంటే, మన ముందు కోట్లాది మంది ఉంటారు కదా? సహేతుకమైన సూచనలు చేయండి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణ తేదీన చీఫ్ సెక్రటరీలు హాజరు కాకపోతే, కఠిన చర్యలతో పాటు జరిమానాలు కూడా విధిస్తామని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఢిల్లీ విషయంలో ఎంసీడీ ఇచ్చిన నివేదిక సరిపోదని, అఫిడవిట్ ఎందుకు దాఖలు చేయలేదో ఢిల్లీ చీఫ్ సెక్రటరీ వివరణ ఇవ్వాలని ఆదేశించింది. కాగా, ఆగస్టు 22న ఇచ్చిన ఆదేశాల ప్రకారం, కుక్కల స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ కార్యక్రమాలతో పాటు, వాటి కోసం ఏర్పాటు చేసిన షెల్టర్ల వివరాలతో అన్ని రాష్ట్రాలు నివేదికలు సమర్పించాల్సి ఉంది. ఈ కేసు తదుపరి విచారణ నవంబర్ 3న జరగనుంది.

# తుపానుపై సంచలన థంబ్ నెయిల్స్, హెడ్డింగ్‌లతో భయభ్రాంతులకు గురిచేయొద్దు

ఏపీకి మొంథా తుపాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉందని, సహాయక చర్యలకు సర్వసన్నద్ధంగా ఉందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించాల్సిన బాధ్యత మీడియాపై ఉందని, ముఖ్యంగా సోషల్ మీడియా, డిజిటల్ మీడియా సంస్థలు సంయమనం పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సంచలనాల కోసం తప్పుడు థంబ్‌నెయిల్స్, హెడ్డింగులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆమె హితవు పలికారు.

**ప్రభుత్వం పూర్తి సన్నద్ధం**

తుపాను హెచ్చరికలు వెలువడిన నాటి నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైందని మంత్రి అనిత తెలిపారు. గత మూడు రోజులుగా సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేశ్ తో కలిసి తాను కూడా ఆర్టీజీఎస్ సెంటర్ నుంచి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నామని, అన్ని విభాగాలను అప్రమత్తం చేశామని వివరించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో పాటు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసేలా పటిష్టమైన ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షించేందుకు జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించామని, సహాయక చర్యలకు అవసరమైన నిధులను కూడా విడుదల చేశామని పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి, మీడియా ద్వారా వాస్తవ పరిస్థితులను వివరిస్తున్నామని తెలిపారు.

**సోషల్ మీడియా బాధ్యతగా వ్యవహరించాలి**

విపత్కర సమయాల్లో సమాచారాన్ని వేగంగా చేరవేసే సోషల్ మీడియా, డిజిటల్ మీడియా వేదికలు మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని మంత్రి అనిత నొక్కిచెప్పారు. అయితే, కొన్ని యూట్యూబ్ ఛానళ్లు, డిజిటల్ మీడియా సంస్థలు కేవలం వ్యూస్ కోసం ప్రజలను భయపెట్టేలా థంబ్‌నెయిల్స్, సంచలన హెడ్డింగులు పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ఆర్టీజీఎస్ సెంటర్ ద్వారా ఈ విషయం తమ పరిశీలనలోకి వచ్చిందని, ఇలాంటి తప్పుడు ప్రచారాల వల్ల ప్రజల్లో తీవ్ర గందరగోళం, అలజడి నెలకొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. "సంచలనాల కోసం, వ్యూస్ కోసం ప్రజలను భయపెట్టేలా వ్యవహరించడం చట్టవిరుద్ధం. అభూత కల్పనలు, అవాస్తవాలతో కూడిన సమాచారం తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలను, వారి కుటుంబ సభ్యులను మానసికంగా కుంగదీస్తుంది. దీన్ని నివారించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని అనిత స్పష్టం చేశారు. వార్తల కవరేజీలో వాస్తవాలకు అద్దం పట్టేలా వ్యవహరించాలని, ప్రభుత్వ అధికారిక సమాచారాన్ని ప్రామాణికంగా తీసుకోవాలని ఆమె సూచించారు. సమాచార వ్యాప్తిలో కీలకపాత్ర పోషించే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా కూడా ఈ విపత్కర సమయంలో ప్రభుత్వానికి, ప్రజలకు అండగా నిలవాలని హోం మంత్రి కోరారు.

# రష్యా నుంచి చమురు కొనుగోలు..
# ట్రంప్ ప్రభుత్వంపై జైశంకర్ ఆగ్రహం

రష్యా చమురు విషయంలో అమెరికా అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ తీవ్రంగా ఖండించారు. ఇంధన కొనుగోళ్ల విషయంలో అమెరికా ఒక్కో దేశంతో ఒక్కో విధంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. నీతులు బోధించేవారే వాటికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. కౌలాలంపూర్‌లో జరిగిన ఆసియాన్ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై ట్రంప్ ప్రభుత్వం 25 శాతం సుంకం విధిస్తున్న విషయం విదితమే. చమురు కొనుగోళ్లను నిలిపివేయాలని భారత్‌పై ఒత్తిడి తెస్తోంది. అదే సమయంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న చైనా, యూరప్ దేశాలపై మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ఆసియాన్ సదస్సులో అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియోతో జైశంకర్ సమావేశమయ్యారు. అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

# విజయవాడ కనకదుర్గమ్మ సాక్షిగా సత్యప్రమాణం
# చేసిన జోగి రమేశ్.. చంద్రబాబు, లోకేశ్‌కు సవాల్

నకిలీ మద్యం కేసులో తనపై వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయంలో సత్యప్రమాణం చేసి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే ప్రయత్నం చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఇంద్రకీలాద్రికి చేరుకున్న ఆయన, ఘాట్ రోడ్డు ప్రవేశద్వారం వద్ద చేతిలో దీపం వెలిగించి, ఈ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జోగి రమేశ్ మాట్లాడుతూ.. "నా వ్యక్తిత్వంపై నింద వేశారు. నా మనసును గాయపరిచారు. అందుకే కుటుంబంతో సహా వచ్చి, ఏ తప్పు చేయలేదని అమ్మవారి ఎదుట నిండు మనసుతో ప్రమాణం చేశాను. నా కుటుంబాన్ని అవమానించిన వారికి అమ్మవారు మంచి బుద్ధి ప్రసాదించాలి" అని అన్నారు. గతంలో తాను చెప్పినట్లే తిరుపతి వెంకన్న, బెజవాడ దుర్గమ్మపై ప్రమాణానికి కట్టుబడి ఉన్నానని, అందులో భాగంగానే ఇప్పుడు ప్రమాణం చేశానని తెలిపారు. నకిలీ మద్యం కేసులో నార్కో అనాలసిస్, లైడిటెక్టర్ టెస్టులకు కూడా తాను సిద్ధంగా ఉన్నానని పునరుద్ఘాటించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. "నాపై తప్పుడు ఆరోపణలు చేసిన వారు సత్యప్రమాణానికి సిద్ధమా? కనీసం లైడిటెక్టర్ టెస్టుకైనా వచ్చే దమ్ముందా? కనకదుర్గమ్మ సాక్షిగా నేను తప్పు చేసినట్లు నిరూపించాలి" అని సవాల్ విసిరారు.

# తుపాను సందట్లో దొంగల బెడద లేకుండా చూడాలి

మొంథా తుపాను కాకినాడ సమీపంలో తీరం దాటనుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం పూర్తి సన్నద్ధతతో ఉండాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ప్రాణ నష్టాన్ని నివారించడమే ప్రథమ కర్తవ్యంగా భావించి, ముందస్తు రక్షణ చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. మొంథా తుపాను ప్రభావం, సహాయక చర్యలపై కాకినాడ జిల్లా ఇంఛార్జి మంత్రి నారాయణ, స్పెషల్ ఆఫీసర్ కృష్ణతేజ, జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, ఎస్పీ బిందు మాధవ్, ఇతర ఉన్నతాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "మొంథా తుపాను ప్రభావం కాకినాడ జిల్లాలోని 12 మండలాలపై అధికంగా ఉంటుందని సమాచారం. రేపు కాకినాడ పరిసర ప్రాంతాల్లో తీరం దాటే సమయంలో బలమైన ఈదురుగాలులు, అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉంది. యంత్రాంగం 24 గంటలూ అందుబాటులో ఉంటూ పరిస్థితిని సమీక్షించాలి. తీర ప్రాంత ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. ఇప్పటికే జిల్లాలో 260 పునరావాస కేంద్రాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఆయా కేంద్రాల్లో ఆహారం, పరిశుభ్రమైన తాగునీరు, పాలు, అత్యవసర ఔషధాలు సిద్ధంగా ఉంచాలి" అని దిశానిర్దేశం చేశారు.

ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కల్యాణ్ సూచించారు. "పిఠాపురం నియోజకవర్గంతో పాటు జిల్లావ్యాప్తంగా ఉన్న గర్భిణులను సురక్షిత ప్రదేశాలకు తరలించాలి. ఇప్పటికే 142 మంది గర్భిణులను పునరావాస కేంద్రాలకు చేర్చినట్లు కలెక్టర్ తెలిపారు. వారికి అవసరమైన పౌష్టికాహారం, వైద్య సేవలు నిరంతరం అందేలా చూడాలి. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసిన విషయాన్ని ప్రజలకు తెలియజేయాలి. తుపానుపై భయాందోళనలు సృష్టించకుండా, గ్రామాల్లో మైకుల ద్వారా సహాయక చర్యలను వివరిస్తూ ప్రజలకు ధైర్యం చెప్పాలి" అని ఆయన అన్నారు.

**అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి**

తుపాను సహాయక చర్యల్లో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పునరావాస కేంద్రాలకు తరలివెళ్లిన ప్రజల ఇళ్లకు దొంగల బెడద లేకుండా పోలీసులు ప్రత్యేక భద్రత కల్పించాలని, అవసరమైతే సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏలేరు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నందున, ఆయకట్టు ప్రజలను జలవనరుల శాఖ అధికారులు ముందుగానే అప్రమత్తం చేయాలన్నారు. బలహీనంగా ఉన్న చెరువు కట్టలు, కాలువ గట్లను గుర్తించి ఇసుక బస్తాలతో పటిష్ఠం చేయాలని సూచించారు.

మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లకుండా కట్టడి చేయాలని, వారి బోట్లకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులకు తెలిపారు. తుపాను కారణంగా నిత్యావసర వస్తువుల సరఫరాకు ఆటంకం కలగకుండా మార్కెటింగ్ శాఖ చూడాలన్నారు. విద్యుత్ స్తంభాలు, కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినే అవకాశం ఉన్నందున, మరమ్మతుల కోసం సిబ్బందిని సిద్ధం చేయాలని, అత్యవసర సమాచారం కోసం శాటిలైట్ ఫోన్లను వినియోగించాలని సూచించారు.

**కాకినాడకు కోటి రూపాయల అత్యవసర నిధి**

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ. 19 కోట్లు విడుదల చేయగా, అందులో కాకినాడ జిల్లాకు ప్రత్యేకంగా రూ. కోటి కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ నిధులను పునరావాస కేంద్రాల్లో సౌకర్యాల కల్పన, బాధితులకు నిత్యావసరాల పంపిణీ, దెబ్బతిన్న ఇళ్లకు తక్షణ సాయం అందించడం వంటి కార్యక్రమాలకు వినియోగించాలని అధికారులకు స్పష్టం చేశారు.

# ఏపీలో ఇప్పుడు హై అలర్ట్... కలసికట్టుగా ఎదుర్కొందాం

- మొదటి పేజి తరువాయి

ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు తుపాను సన్నద్ధతపై ఆయన వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలోని 19 జిల్లాల్లో దాదాపు 40 లక్షల మంది ప్రజలు తుపాను ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందని అంచనా వేసినట్లు మంత్రి తెలిపారు. వీరి భద్రతను దృష్టిలో ఉంచుకుని, ప్రమాదకర ప్రాంతాల్లోని 1,238 గ్రామాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. బాధితుల కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,906 పునరావాస కేంద్రాలను సిద్ధం చేసినట్లు వివరించారు. ముఖ్యంగా 3,465 మంది గర్భిణులు, బాలింతలను గుర్తించి, వారిని సురక్షితంగా ఆసుపత్రులకు తరలించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు.

ముందస్తు చర్యల్లో భాగంగా 14,798 పాఠశాలలకు సెలవులు ప్రకటించగా, వాటిలో 364 పాఠశాలలను తుపాను షెల్టర్లుగా మార్చారు. అక్టోబర్ 29 వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని, బోటింగ్, బీచ్‌లలో పర్యాటకంపై పూర్తి నిషేధం విధించినట్లు లోకేశ్ వెల్లడించారు. సహాయక చర్యల కోసం 11 ఎన్డీఆర్ఎఫ్, 12 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించారు. అగ్నిమాపక సిబ్బంది, బోట్ బృందాలు, చెట్లను తొలగించే బృందాలను లైఫ్ జాకెట్లు, ఇతర రక్షణ పరికరాలతో సిద్ధం చేశారు. అత్యవసర వైద్య సేవలకు 325 మెడికల్ క్యాంపులు, 876 ఆరోగ్య తక్షణ స్పందన బృందాలు, 108, 104 అంబులెన్సులను అందుబాటులో ఉంచారు. మూడు బోట్ క్లినిక్‌లను కూడా క్రియాశీలకం చేశారు.

తుపాను అనంతరం విద్యుత్ పునరుద్ధరణ కోసం 772 బృందాలను 11,347 స్తంభాలు, 1,210 ట్రాన్స్‌ఫార్మర్లతో సిద్ధంగా ఉంచారు. రహదారులపై అడ్డంకులను తొలగించడానికి 7,289 యంత్రాలు, తాగునీటి సరఫరాకు 1,521 ట్యాంకర్లు, 1,037 జనరేటర్లు ఏర్పాటు చేశారు. కమ్యూనికేషన్ వ్యవస్థకు అంతరాయం కలగకుండా 16 శాటిలైట్ ఫోన్లు, 35 డీఎంఆర్ సెట్లు, 10 మొబైల్ నెట్‌వర్క్ టవర్లను (%జూఔం%) కీలక ప్రాంతాల్లో మోహరించారు. ప్రధానమంత్రి కార్యాలయం, ఆర్మీ, ఎన్డీఎంఏ, పొరుగు రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపడుతున్నట్లు మంత్రి నారా లోకేశ్ వివరించారు. ప్రజలు ఇళ్లకే పరిమితం కావాలని, లోతట్టు ప్రాంతాలకు వెళ్లవద్దని మంత్రి లోకేశ్ సూచించారు. ప్రభుత్వం జారీ చేసే అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని కోరారు. ఈ విపత్తును అందరం కలిసికట్టుగా ఎదుర్కొందామని ఆయన పిలుపునిచ్చారు.

# గెలిస్తే అనుమానం వస్తుందని బీహార్‌లో బీజేపీ గెలవదు

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలవదని, ఆ పార్టీయే ఆర్జేడీని గెలిపిస్తుం దని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఓటర్ల జాబితాలో అసలైన ఓట్లను తొలగించి, లేని ఓట్లను చేర్చారని ఆరోపించారు. దేశంలో ఈవీఎం ద్వారా ఓటింగ్ ఉన్నంత వరకు బీజేపీ అధికారంలో ఉంటుందని ఆయన వ్యాఖ్యా నించారు. బీహార్‌లో బీజేపీ గెలిస్తే దేశ ప్రజలకు అనుమానం వస్తుందనే ఆలోచనతో అక్కడ ఆర్జేడీని గెలిపిస్తారని ఆయన జోస్యం చెప్పారు. ఎన్నికలు బ్యాలెట్ విధానంలోనే జరగాలని ఆయన డిమాండ్ చేశారు. బ్యాలెట్ విధానం కోసం తన పార్టీ పోరాడుతోందని కేఏ పాల్ పేర్కొన్నారు.

## 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీం సీరియస్...
## అన్ని రాష్ట్రాలకు నోటీసులు

- మొదటి పేజి తరువాయి

ఈ తరహా మోసాలకు సంబంధించి తమ పరిధిలో నమోదైన ప్రథమ సమాచార నివేదికల (ఎఫ్ఐఆర్) వివరాలు సమర్పించా లని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. "దేశవ్యాప్తంగా ఒకేరీతిలో దర్యాప్తు జరిగేలా చూసేందుకు రాష్ట్రాలకు నోటీసులు జారీ చేస్తున్నాం" అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ 'డిజిటల్ అరెస్ట్' మోసాలు కేవలం దేశవ్యాప్తంగానే కాకుండా, దేశ సరిహద్దులు దాటి కూడా జరుగుతున్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. అందుకే ఈ కేసుల దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి అప్పగించేందుకు మొగ్గు చూపుతున్నట్లు సూచించింది.

కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ఇలాంటి అనేక కేసులను సీబీఐ ఇప్పటికే దర్యాప్తు చేస్తోందని, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సైబర్ క్రైమ్ విభాగం సాంకేతిక సహకారం అందిస్తోందని కోర్టుకు తెలిపారు. అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి మాట్లాడుతూ, ఈ మోసాల వెనుక ఉన్న మనీలాండరింగ్ ముఠాలు భారత్ బయట నుంచి, ముఖ్యంగా మయన్మార్, థాయ్‌లాండ్ వంటి దేశాల నుంచి పనిచేస్తున్నాయని వివరించారు. విచారణ సందర్భం గా, హర్యానా ప్రభుత్వం స్పందిస్తూ... అంబాలా సైబర్ క్రైమ్ బ్రాంచ్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, దర్యాప్తును సీబీఐకి బదిలీ చేయడా నికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలియజేసింది. సంబంధిత ఇతర ఎఫ్ఐఆర్‌ల వివరాలు సమర్పించేందుకు వారం రోజుల సమయం కోరగా, ధర్మాసనం అనుమతించింది. ఈ క్రమంలో, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తమ పరిధిలో నమోదైన 'డిజిటల్ అరెస్ట్' సంబంధిత ఎఫ్ఐఆర్‌ల వివరాలను అందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రస్తుతానికి అధికారికంగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాల్సిన అవసరం లేదని, కేవలం కేసుల వివరాలను రికార్డుల రూపంలో అందించాలని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు తమ నివేదికలు సమర్పించిన తర్వాత ఈ కేసుపై తదుపరి విచారణ జరగనుంది.

## మొంథా తుపానుపై
## సీఎం చంద్రబాబు సమీక్ష..

- మొదటి పేజి తరువాయి

కాలువ గట్లను పటిష్టం చేయాలని స్పష్టం చేశారు. ప్రధాని కార్యాలయంతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని మంత్రి నారా లోకేశ్‌కు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, అనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్..

- మొదటి పేజి తరువాయి

ఎస్ఐఆర్ విజయవంతమైందని, మరో 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో దీనిని నిర్వహించబోతున్నామని తెలిపింది. ఈ మేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మాట్లాడుతూ, రెండో దశ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను త్వరలో చేపట్టనున్నామని వెల్లడించారు.

1951 నుంచి 2004 వరకు ఎనిమిదిసార్లు ఎస్ఐఆర్ నిర్వహించారని అన్నారు. 21 ఏళ్ల కిందట ఓటర్ల జాబితా సవరణ జరిగిందని గుర్తు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా నకిలీ ఓట్లు, అక్రమ వలసదారులు, చనిపోయిన, బదిలీ చేయబడిన ఓటర్లను తొలగించినట్లు వెల్లడించారు. ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా సవరణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. బీహార్‌లో 7.5 కోట్ల మందితో ఎస్ఐఆర్ విజయవంతంగా పూర్తయిందని అన్నారు. బీహార్‌లో ఈ ప్రక్రియపై ఎవరూ అభ్యంతరాలు చెప్పలేదని తెలియజేశారు. రెండో దశలోనూ ప్రతి ఇంటికి మూడుసార్లు వెళ్లి ఓటరుపై నిర్ధారణ చేసుకుంటామని తెలిపారు. ఎస్ఐఆర్‌పై రాజకీయ అవగాహన కల్పిస్తామని ఆయన అన్నారు. రెండో దశలో ప్రత్యేక సమగ్ర సవరణ జరగనున్న రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు: అండమాన్ నికోబర్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్. రెండో దశ ఎస్ఐఆర్ జరగనున్న రాష్ట్రాల్లో 51 కోట్లకు పైగా ఓటర్లు ఉన్నారని, నవంబర్ 4వ తేదీ నుండి ప్రారంభమవుతుందని తెలిపారు. అసోంలో ఎన్ఆర్‌సీ ఉన్నందున ఎస్ఐఆర్ లేదని స్పష్టం చేశారు.

## ఏపీలో రైల్వే ప్రాజెక్టులపై సీఎం
## చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. ఈ కీలక ప్రాజెక్టులను వేగవంతం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సమీక్షలో పలు ముఖ్యమైన రైల్వే లైన్ల పనుల పురోగతిపై అధికారులు నివేదిక సమర్పించారు. ముఖ్యంగా నడికుడి-శ్రీకాళహస్తి, గుంటూరు-గుంతకల్ డబ్లింగ్, గుణదల-ముస్తాబాద్ బైపాస్, రాయదుర్గ్-తుముకూరు మధ్య కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులు ఎంతవరకు వచ్చాయో చర్చకు వచ్చింది. వీటితో పాటు, రాష్ట్రంలో కొత్తగా చేపట్టాల్సిన రైల్వే లైన్లు, అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద రైల్వే స్టేషన్ల అభివృద్ధి, రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ), అండర్ బ్రిడ్జి (ఆర్ యూబీ)ల నిర్మాణానికి సంబంధించి రైల్వే శాఖకు పంపిన ప్రతిపాదనలపైనా సమీక్షించారు. ఈ సమావేశంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ శ్రీవాస్తవ, తూర్పు, దక్షిణ కోస్తా రైల్వేలకు చెందిన పలువురు కీలక అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం, రైల్వే శాఖ సమన్వయంతో పనిచేయాలని ఈ సమావేశంలో అభిప్రాయపడినట్లు సమాచారం.

## మొంథా తుఫాన్ నేపథ్యంలో కురిసే వర్షాలకు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు : కలెక్టర్ ఓ.ఆనంద్



**అనంతపురం, పెన్ పవర్ అక్టోబర్ 27 :** మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని, ఎప్పటికప్పుడు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ, వాతావరణ శాఖ వారి హెచ్చరికలు, సూచనల మేరకు ప్రజలను అప్రమత్తం చేయడం జరుగుతోందని, మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో కురిసే వర్షాలకు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సహాయ చర్యల కొరకు జిల్లా కేంద్రంలో, రెవెన్యూ డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామని అనంతపురము జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ రెవెన్యూ భవన్ నందు జిల్లా అధికారులతో మొంథా తుఫాను సన్నద్ధతపై జిల్లా కలెక్టర్ సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. జిల్లాపై సదరు తుఫాను తీవ్ర ప్రభావం లేనప్పటికీ, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు. ఆ నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నంబర్: 85002929928కి కాల్ చేసి సహాయం పొందవచ్చని అన్నారు. అలాగే ఆయా మండలాల తహసీల్దార్‌ల కార్యాలయంలో, ఆర్డీఓ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు సహాయం కొరకు కంట్రోల్ రూమ్ సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. వర్షాల వేళ ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో పలు చోట్ల పిడుగులు పడే అవకాశం ఉందని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడేప్పుడు చెట్లు, టవర్స్, పోల్స్, పొలాలు, బహిరంగ ప్రదేశాల్లో ఎవరూ ఉండరాదని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

# భారీ వర్షాలకు జిల్లావాసులు అప్రమత్తంగా ఉండాలి

### ఉల్లి, మొక్కజొన్న, టమోటా రైతులు పంట కోత వాయిదా వేసుకోవాలని సూచన : జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, పెన్ పవర్ అక్టోబర్ 27 :** "మొంథా" తుఫాను ప్రభావంతో వచ్చే మూడు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలందరినీ అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో తుఫాన్ ప్రభావ భద్రతా చర్యలపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె. కార్తిక్, డిఆర్ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ మొంథా తుఫాను కాకినాడ%-%విశాఖపట్నం మధ్య తీరం దాటుతుందని, దాని ప్రభావం రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు నంద్యాల జిల్లాపైనా ఉండే అవకాశముందని అన్నారు. తుఫాను ప్రభావం నేపథ్యంలో జిల్లాలోని రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ఉల్లి, మొక్కజొన్న, టమోటా రైతులు పంట కోతను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో సుమారు 30 శాతం మొక్కజొన్న కోత జరగగా, అధిక తేమ కారణంగా పంటలకు తక్కువ ధరలు పడే అవకాశం ఉందని, వ్యాపారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే పంటలను కొనుగోలు చేయాలని సూచించారు. రైతులకు పంట కోత వాయిదా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని వ్యవసాయ, ఉద్యాన అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగడం లేదని, ముఖ్యంగా ఆత్మకూరు పట్టణంలో నిర్లక్ష్యం కొనసాగుతోందన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించి పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆమె మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు మాత్రమే అందేలా చర్యలు చేపట్టాలని, అన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో క్లోరినేషన్ తప్పనిసరిగా చేయాలని ఆమె సూచించారు. అదే విధంగా ఆర్ఓ ప్లాంట్లలో క్లోరినేషన్ నిర్వహించడమే కాకుండా ఫిల్టర్ మెంబ్రేన్లను శుభ్రపరచాలని, నాణ్యత ప్రమాణాలు పాటించని ప్లాంట్లను సీజ్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వర్షాల ప్రభావంతో ప్రమాదావస్థలో ఉన్న మట్టి మిద్దెల్లో నివసించే ప్రజలకు నోటీసులు జారీ చేసి, సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా కెనాల్స్, చెరువుల వద్ద గండి పడిన ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ఇసుక సంచులు వంటి అవసరమైన సామాగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలని, అధిక వర్షపాతం నమోదైతే వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఆధార్ అప్‌డేట్ స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు ఆధార్ వివరాలు సరిచేయని వారు తప్పనిసరిగా బయోమెట్రిక్, చిరునామా తదితర వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. దీని ద్వారా ఈ-కెవైసీ పూర్తి చేసి ప్రభుత్వ లబ్ది పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా పూర్తి చేయాలని, వర్షాల వల్ల నష్టపోయే పంటలపై ఈ-క్రాప్ నమోదు ఆధారంగా నష్టపరిహారం అంచనా వేయగలమని కలెక్టర్ వివరించారు. అదేవిధంగా విద్యార్థులకు జారీ చేసే అపార్ ఐడీలు కూడా ఈ క్యాంపుల్లో పొందేలా అవకాశం కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు.




### ప్రజల నుంచి వచ్చే ఆర్జీలకు

# పరిష్కార మార్గాన్ని చూపాలి



అనంతపురం , పెన్ పవర్ అక్టోబర్ 27 : ప్రజా సమస్య పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టిని సారించిబాధ్యతతోపనిచేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. అర్జీలను స్వీకరించిన తర్వాత వాటిని పరిశీలించి నాణ్యమైన పరిష్కార మార్గాన్ని అర్జీదారులకు చూపాలని సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన పి.జి.ఆర్.యస్ కార్యక్రమంలో వివిధసమస్యలపై ప్రజలు అందజేసిన 565అర్జీలను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ స్వీకరించి సంబంధిత శాఖ అధికారులకు తగు చర్యల నిమిత్తం ఆదేశాలు జారీ చేశారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్)లో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులుఅర్జీలను క్షుణ్ణంగాపరిశీలించి నిర్దిష్ట కాల పరిమితులో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్జీదారు సంతృప్తి చెందేలా వేగంగా పరిష్కరించినప్పుడే అధికారులపై విశ్వాసం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలోజిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ,అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్,జిల్లా రెవెన్యూ అధికారి ఏ.మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లి కార్జున, రామ్మోహన్, ఆనంద్,వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, వివిధ శాఖలకు సంబందించిన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


## కడప నగర ప్రజల అప్రమత్తంగా ఉండాలి : కడప నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మనోజ్ రెడ్డి

**కడప పెన్ పవర్ అక్టోబర్ 27 :** రాబోయే రెండు రోజుల పాటు కడప నగరంలో భారీ వర్షాల సూచన ఉన్న నేపథ్యంలో, ఈరోజు సాయంత్రం కడప నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మనోజ్ రెడ్డి కడప ఆర్డీవో జాన్ ఎర్విన్ తో కలిసి నగరంలోని బుగ్గ వంక డ్యామ్ మరియు బుగ్గ వంక లోతట్టు ప్రాంతాలను పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ ఇంజనీర్ జగదీశ్వర రెడ్డి తో కలిసి లోతట్టు ప్రాంతాల పరిస్థితులను పరిశీలించి, అక్కడ ఉన్న సమస్యలను గుర్తించారు. గుర్తించిన సమస్యలకు తగిన పరిష్కార చర్యలు త్వరితగతిన చేపట్టాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.





## శ్రీ కపిలేశ్వరాలయంలో శాస్త్రోక్తంగా దక్షిణామూర్తి హెూమం



తిరుపతి పెన్ పవర్ అక్టోబర్ 27 : వైభవంగా శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారి దివ్యకల్యాణం. తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో నెల రోజుల పాటు జరుగుతున్న హెూమ మహెూత్సవాల్లో భాగంగా సోమవారం దక్షిణామూర్తి హెూమం శాస్త్రోక్తంగా జరిగింది. ఇందులో భాగంగా యాగశాలలో ఉదయం 8 నుండి 11 గంటల వరకు దక్షిణామూర్తి హెూమం, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, మహాశాంతి అభిషేకం, దక్షిణామూర్తి కలశాభిషేకం నిర్వహించారు. శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారి దివ్యకల్యాణం సాయంత్రం 5.30 గంటలకు శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారి దివ్యకల్యాణ మహెూత్సవం వైభవంగా జరిగింది.

**అక్టోబరు 28న శ్రీ నవగ్రహ హెూమం :** అక్టోబరు 28న శ్రీ నవగ్రహ హెూమం హెూమం జరుగనుంది. గృహస్తులు రూ. 500/- చెల్లించి ఒక రోజు హెూమంలో పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, అన్నప్రసాదం అందజేస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో శ్రీమతి నాగరత్న, సూపరింటెండెంట్ శ్రీ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.







# నగరంలో 77లక్షలతో రోడ్లు, మోటార్ పంప్స్ ప్రారంభం

### - ఎంపీ అంబికా, కమిషనర్ బాలాస్వామి



**అనంతపురం పెన్ పవర్ అక్టోబర్ 27 :** అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీర్చే బాధ్యత మాది అని.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నగరంలో ఆయన 77 లక్షలతో సీసీ రోడ్లు, మోటార్ పంపులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కమిషనర్ బాలస్వామి తో పాటు అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బుద్ధప నగర్, శ్రీనగర్ కాలనీల్లో ఉన్న వాటర్ ట్యాంకుల వద్ద స్టార్ డెల్టా స్టార్టర్ బాక్స్, 20హె.పి. బూస్టర్ మోనోబ్లాక్ మోటార్ పంపులను ఏర్పాటు చేశారు. అత్యాధునిక మోటార్లను కేవలం ఐదు లక్షలతో ఏర్పాటు చేశారు. ఆజాద్ నగర్, ఒకటవ రోడ్డు లోని పొట్టి శ్రీరాములు స్కూల్ వద్ద నూతన సిసి రోడ్లకు భూమి పూజ చేశారు. మొత్తం వీటి విలువ 77 లక్షల వరకు ఉంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు.

ఇప్పటికే 30 కోట్లతో నగరంలో అభివృద్ధి పనులు చేశామన్నారు. 20ఏళ్ల నుంచి పెండింగ్ లో ఉన్న సిసి రోడ్లు, డ్రైన్లు కూడా వేస్తున్నట్లు చెప్పారు. గతంలో కొన్ని కాలనీల్లో రోజు మార్చి రోజు నీరు వస్తుండేదన్నారు. ఇప్పుడు అత్యాధునిక మోటార్లు ఏర్పాటు చేసి ప్రతిరోజు నీరు అందించే విధంగా చూస్తున్నామన్నారు. దీనివల్ల చాలా కాలనీలకు ప్రతిరోజు నీరు అందుతుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వీలైనంత తక్కువ మొత్తానికి ఎక్కువ పనులు జరిగేలా చూస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు పేర్కొన్నారు. మహిళా సంఘాల సభ్యులు సమావేశాలకు సరైన సదుపాయం లేదని తమ దృష్టికి తీసుకొచ్చారని.. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ దీనిపై స్పందించి అందుకు సంబంధించిన కమ్యూనిటీ భవనాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో అనంతపురం నగరంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చూస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

## మనోబంధు ఫౌండేషన్ పత్రికను ఆవిష్కరించిన డాక్టర్ బ్రహ్మారెడ్డి, డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి



**నంద్యాల, పెన్ పవర్ అక్టోబర్ 27 :** సమాజ సేవా కార్యక్రమాలు ఎంతో గొప్పవైనవని ఇలాంటి మంచి కార్యక్రమాలకు మా సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని డాక్టర్ బ్రహ్మారెడ్డి, డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి లు అన్నారు. సోమవారం నంద్యాల తమ బ్రహ్మ రెడ్డి కార్యాలయాల్లో మనో బంధు ఫౌండేషన్ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "సమాజ సేవా కార్యక్రమాలు ఎంతో గొప్పవైనవి. ఇలాంటి మంచి కార్యక్రమా లకు మా సహకారం ఎల్లప్పుడూ ఉంటుంద న్నారు. నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ రమేష్ మాట్లాడుతూ మనోబంధు ఫౌండేషన్ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా, అలాగే తెలంగాణ ప్రాంతంలో కూడా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీతో కలిసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. దేశ వ్యాప్తంగా రోడ్ల వెంట, పట్టణాల్లో నిరాధారంగా తిరుగుతున్న మానసిక రోగులను గుర్తించి వారికి సరైన వైద్యసహాయం, పౌష్టికాహారం, యోగా శిక్షణ, పునరావాస సేవలు అందించడం మనోబంధు ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ విధంగా వారు కోలుకున్న తర్వాత, వారిని వారి కుటుంబ సభ్యుల వద్దకు లేదా గుర్తింపు పొందిన వసతిగృహాలలో చేర్చడం ఫౌండేషన్ ధ్యేయమని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ రమేష్ బాబు, ప్రముఖ సామాజిక సేవాకర్త శ్రీరాములు, మనోబంధు ఫౌండేషన్ రాయలసీమ రీజనల్ డైరెక్టర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

### మనోబంధు ఫౌండేషన్ పత్రికను ఆవిష్కరించిన

## జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, ఎస్పీ సునీల్ శరన్





**నంద్యాల పెన్ పవర్ అక్టోబర్ 27 :** నంద్యాల కలెక్టరేట్ కార్యాలయంలో మన బంధు ఫౌండేషన్ పత్రికను నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సునీల్ శరన్ మనోబంధు ఫౌండేషన్ పత్రికను ఆవిష్కరించడం జరిగినది. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మంచి సేవా కార్యక్రమాలకు మా సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలియజేశారు. మన ఓ బంధు ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా, మరియు తెలంగాణ ప్రాంతంలో, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తో కలిసి పని చేయడం జరుగుతున్నదని నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ దస్తగిరి పర్ల తెలియజేశారు. మనోబంధు ఫౌండేషన్ ప్రధాన ధ్యేయము మనదేశంలోని ఎక్కడైనా రోడ్ల వెంబడి, నగరంలో నిరాధారణకు గురి అయిన మానసిక రోగులను గుర్తించి సరి అయిన వైద్య సహాయము , మంచి ఆహారము, యోగ తదితర కార్యక్రమాలు నేర్పించి, పౌష్టిక ఆహారం అందించిన ఎడల వారు ఆరోగ్యవంతులుగా మారి వారిని వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చడం లేదా గుర్తింపు పొందినటువంటి వసతి గృహాలలో వారిని చేర్పించదము. ఆ విధంగా సాటి మానవులకు సేవ చేసే భాగ్యం, అలాగే మనోబంధు సేవా ఫౌండేషన్ పత్రికను ఆవిష్కరణ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్‌తో పాటు, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ దస్తగిరి పర్ల, కోశాధికారి నాగేశ్వరరావు, మేనేజింగ్ కమిటీ మెంబర్ ఉస్మాన్ భాష, మనోబంధు ఫౌండేషన్ రాయలసీమ రీజనల్ డైరెక్టర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మొంథా తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి : డిఎల్పిఓ శ్రీనివాసరెడ్డి




**సిఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 27 :** మొంథా తుఫాన్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని విభాగాలు అప్రమత్తంగా ఉండాలని డిఎల్డిఓ మరియు మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి అధికారులకు సూచించారు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం వాహనాలు బస్సులు జెసిబి యంత్రాలతో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగాళా ఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను ఈనెల 27 28 29 తేదీలలో తీరం దాటే అవకాశం ఉన్నందున, వాతావరణ శాఖల హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అధికారులందరూ అందుబాటులో ఉండాలని అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయని తెలిపారు తుపాను ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలన్నారు.

తుఫాను తీవ్రత దృష్ట్యా జిల్లాలో ఎక్కడ ప్రాణ, ఆస్తి జరగకుండా అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. తుపాను సమయములో ప్రజలకు తక్షణం సహాయం అందించేందుకు మండల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు భయపడకుండా అధికారుల సూచనలను పాటించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ మహమ్మద్ హుస్సేన్, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

## తైక్వాండో విజేతలకు ఎమ్మెల్యే దగ్గుపాటి సూచన




**అంతపురం పెన్ పవర్ అక్టోబర్ 27 :** అనంతపురం పేరు జాతీయ స్థాయిలో వినిపించాలని తైక్వాండో విజేతలకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 42వ అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి జూనియర్ తైక్వాండో పోటీల్లో అనంతపురం వాసులు గెలుపొందారు. విజయనగరం జిల్లాలో జరిగిన పోటీల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. ఈ నేపథ్యంలో అర్బన్ కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటిని కలవగా.. వారిని ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయిలో అనంతపురం పేరు వినిపించేలా చేశారన్నారు. ఇప్పుడు బెంగళూరులో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో కూడా పతకాలు సాధించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్ కు క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని.. తల్లిందడ్రులు తమ పిల్లల్ని క్రీడల వైపు ప్రోత్సహించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.

## "పులివెందుల సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ విజిట్"




**పులివెందుల పెన్ పవర్ అక్టోబర్ 27 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, గౌరవ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప డాక్టర్ సి.యామిని వారి సూచనల మేరకు గౌరవ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు పులివెందుల సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ ను విజిట్ చేయడం జరిగినది. రిజిస్టర్లను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టము, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు, అనంతరం జైలు పరిసరాలను, రిజిస్టర్ లను పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగినది. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఏవైనా సమస్యలుంటే పులివెందుల మండల న్యాయ సేవా సమితిని మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమములో పులివెందుల సబ్ జైలు సూపర్డెంట్, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు మరియు ఖైదీలు పాల్గొన్నారు.




## విభిన్న ప్రతిభావంతుల చట్టం సమర్థవంతంగా చర్యలు : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్




**అనంతపురం, పెన్ పవర్ అక్టోబర్ 27 :** విభిన్న ప్రతిభావంతుల చట్టం సమర్థవంతంగా అమలయ్యే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. సోమవారం అనంతపురంలోని కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో వికలాంగుల హక్కులు చట్టం 2016&ఆంధ్రప్రదేశ్ వికలాంగుల హక్కులపై జిల్లా స్థాయి విభిన్న ప్రతిభావంతుల కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏ ఒక్క దివ్యాంగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని, అలాగే అన్ని శాఖలలో దివ్యాంగులకు సంబంధించి రిజర్వేషన్ అమలు జరగాలని ఈ చట్టంలో పొందుపరచడం జరిగిందని తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయా శాఖల జిల్లా అధికారులకు, ఎస్హెచ్ఓలకు చట్టంలో ఉన్న నియమాలను గురించి అందరికీ అవగాహన కల్పించాలని, చట్టం ఉల్లంఘనకు ఎలాంటి వీలులేదని ఆదేశించారు. స్కిల్ డెవలప్మెంట్ నుంచి దివ్యాంగుల శిక్షణ ఇవ్వాలని, షెడ్యూల్ ఏర్పాటు చేసుకొని శిక్షణలు అందించాలని, శిక్షణ గురించి అందరికీ తెలియజేయాలన్నారు.

ఈ సందర్భంగా జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ ఎన్.రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో దివ్యాంగులకు మరియు జిల్లా అధికారులకు న్యాయ సేవ సధన్ లో ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామని, దివ్యాంగులకు సహాయం కావలసివస్తే సహాయానికి ముందుంటామని తెలిపారు. జిల్లాలో ఓల్డేజ్ హోమ్ సంస్థలను అత్యవసర తనిఖీలు చేస్తామని, తనిఖీలు చేసినప్పుడు సంబంధిత అధికారులు తగిన సహకారం అందించాలన్నారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల చట్టంలో ఉన్న నియమాలను జిల్లా కలెక్టర్ సూచించిన విధంగా అమలు పరిచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్జీవోలు, మరియు పి.డబ్ల్యు.డి కమిటీ సభ్యులు పలు సమస్యలను తెలియజేశారు. ఈ సమావేశంలో డిపిఓ నాగరాజు నాయుడు, జిల్లా పరిషత్ సీఈవో శివశంకర్, డిఆర్డిఏ పిడి శైలజ, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డా.కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, మెప్మా పీడీ విశ్వ జ్యోతి, డీఈవో ప్రసాద్ బాబు, ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, వాటాదారులు, ఎన్జీవోలు, మరియు పి.డబ్ల్యు.డి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేయాలి : కలెక్టర్ డా.ఏ.సిరి



**కర్నూలు, పెన్ పవర్ అక్టోబర్ 27 :** ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి హౌసింగ్, పిజిఆర్ఎస్ తదితర అంశాలపై మండల స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ళ నిర్మాణాలు వేగంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు..ఏదైనా మండలంలో ఇళ్ళ నిర్మాణాలు సక్రమంగా జరగకుంటే, సంబంధిత మండలాలకు వెళ్ళి పనులు ఎందుకు జరగడం లేదు, సమస్య ఏంటి అని పరిశీలించి, సమస్యను పరిష్కరించి పురోగతి తీసుకొని వచ్చే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులను నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆడిట్ పెండింగ్ ఎక్కువగా ఉందని, పెండింగ్లో ఉన్న ఆడిట్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సిఎమ్ఓ గ్రీవెన్స్ కి సంబంధించి పెండింగ్ లో ఉన్న అర్జీలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ రాజ్, అండ్ అండ్ బి శాఖలకు సంబంధించి ఎక్కువగా గుంతలు పడిన రోడ్లు, బాగాలేని రోడ్ల వివరాలు పంపాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మిగనూరు, ఆదోని, గూడూరు మున్సిపాలిటీలలో పారిశుధ్యం సరిగా లేదని చేస్తున్నందున, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## " మొంథా" తుఫాను పట్ల ఎలాంటి భయాందోళన అవసరం లేదు..!

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్




**తిరుపతి,పెన్ పవర్ అక్టోబర్ 27 :** "మొంథా" తుఫాను వల్ల జిల్లాలో ఎలాంటి ప్రాణ నష్టం కానీ, ఆస్తి నష్టం కానీ వాటిల్లే అవకాశం లేకుండా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన సహాయక చర్యలు అందించేందుకు అప్రమత్తంగా ఉందని. తుఫాను పట్ల భయభ్రాంతులను చేసే పుకార్లను నమ్మకుండా.. ప్రశాంతంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సోమవారం ఒక ప్రకటన ద్వారా జిల్లా ప్రజలకు సూచించారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో "మొంథా"తుఫాన్ ప్రభావం తిరుపతి జిల్లాకు కూడా ఉండడంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రాష్ట్ర వాతావరణ విపత్తుల నియంత్రణ శాఖ రెడ్ అలెర్ట్ ను ప్రకటించిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేస్తూ.. పలు హెచ్చరికలను కూడా జారీ చేశారు.

**తుపాను సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..!**

ప్రధానంగా పలు సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే పుకార్లను నమ్మవద్దు, ప్రశాంతంగా ఉండండి, భయాందోళన అవసరం లేదు.

లి అత్యవసర కమ్యూనికేషన్ కోసం మీ మొబైల్ ఫోన్లను ఛార్జ్ చేసుకుంటూ ఉండండి, వాతావరణ హెచ్చరికలు కోసం ఎస్ఎంఎస్లను గమనిస్తూ ఉండండి. మీ భద్రత మరియు మనుగడ కోసం అవసరమైన వస్తువులతో "అత్యవసర వస్తు సామగ్రిని" సిద్ధం చేసుకోండి. ప్రభుత్వ అధికారులు సూచించిన వెంటనే సురక్షితమైన ప్రదేశాలకు వెళ్ళండి. మీ పత్రాలు/సర్టిఫికెట్స్ మరియు విలువైన వస్తువులను వాటర్ ప్రూఫ్ కంటైనర్లు/కవర్ లో ఉంచండి. ఎలక్ట్రికల్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేయండి, అన్ని ఎలక్ట్రికల్ ఉపకరణాలు మరియు గ్యాస్ కనెక్షలను తీసివేయండి. తలుపులు మరియు కిటికీలు మూసి ఉంచండి. మీ ఇల్లు సురక్షితం కాకపోతే, తుపాను ప్రారంభం కాకముందే సురక్షితమైన ఆశ్రయం/షెల్టర్ కు చేరుకోండి. పాత భవనాలు, చెట్లు, విద్యుత్ వైర్లు స్తంభాల కింద ఎప్పుడూ ఉండకండి. పశువులు, పెంపుడు జంతువులకు కట్టిన తాడును విప్పి వాటిని వదిలివేయండి. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్ళకండి. అత్యవసర సహాయ సమాచారం నిమిత్తం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని కంట్రోల్ రూంతో పాటు తిరుపతి, శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్ళూరు పేట ఆర్డీవో కార్యాలయాల్లో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయం, తిరుపతి కంట్రోల్ రూమ్ : 0877-2236007 ఆర్డీవో కార్యాలయం, తిరుపతి : 7032157040, ఆర్డీవో కార్యాలయం, శ్రీ కాళహస్తి: 8555003504. ఆర్డీవో కార్యాలయం, గూడూరు : 08624-252807,8500008279 ఆర్డీవో కార్యాలయం, సూళ్ళూరుపేట : 08623295345 అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహణలో 24/7 పనిచేసే టోల్ ఫ్రీ నెంబర్లు : 112, 1070, 1800 425 0101 లకు కాల్ చేయవచ్చని జిల్లా కలెక్టర్ పై ప్రకటనలో తెలిపారు.


## ప్రజాభిప్రాయ సేకరణలో మెరుగైన శాతాన్ని సాధించాలి : కలెక్టర్ రాజకుమారి గణియా




నంద్యాల పెన్ పవర్, అక్టోబర్ 27 : ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై ప్రజల నుండి సేకరించే అభిప్రాయాల ప్రక్రియలో నంద్యాల జిల్లా రాష్ట్ర స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన అనంతరం, ప్రజాభిప్రాయ సేకరణపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలైన రెవెన్యూ, సర్వే, గృహనిర్మాణం, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, పింఛన్ పంపిణీ, కాలుష్య నియంత్రణ, ఆరోగ్య సేవలు, తదితర విభాగాల్లో ప్రజాభిప్రాయ సేకరణలో అసంతృప్తికర స్పందనలు రాష్ట్ర స్థాయిలో నమోదైన నేపథ్యంలో సంబంధిత అధికారులు సమన్వయంతో సరిదిద్దే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజాభిప్రాయ సేకరణ అంటే ప్రజలు ప్రభుత్వ సేవలను ఎలా అనుభవిస్తున్నారన్నదానికి ప్రతిబింబమని ప్రతి అధికారి తమ పరిధిలోని సచివాలయాల పనితీరును సమీక్షించి, తగు ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని 13 సచివాలయాలు ప్రజాభిప్రాయ సేకరణలో దిగువ స్థానంలో ఉన్నాయని, ఇది సిబ్బంది పనితీరు అసంతృప్తికరంగా ఉన్నట్లు స్పష్టం అవుతోందన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే పరిస్థితి కొనసాగితే, ఆయా సచివాలయ సిబ్బందిపై, సంబంధిత తహసీల్దారులు, ఆర్డీవోలపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదన్నారు. పనితీరు మెరుగుపరుచుకుని ప్రజాభిప్రాయ సేకరణలో మెరుగైన శాతాన్ని సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే డోన్, బేతంచర్ల, ఆత్మకూరు మున్సిపాలిటీలలో పారిశుధ్య కార్యక్రమాలు అసంతృప్తికరంగా ఉన్నట్లు ప్రజాభిప్రాయ సేకరణలో వెల్లడైనట్లు తెలిపారు. పారిశుధ్య కార్యకలాపాలను మరింత బలోపేతం చేస్తూ, ప్రతీ మున్సిపాలిటీ మరియు గ్రామ సచివాలయ పరిధిలో రోజువారీ శుభ్రత పనులను పర్యవేక్షించాలన్నారు. ప్రజల అభిప్రాయాల ద్వారా ప్రభుత్వ పథకాల పనితీరు అంచనా వేయబడుతుందని, అందుకే ప్రతి శాఖ ప్రజల సంతృప్తిని లక్ష్యంగా పెట్టుకోవాలని ఆమె అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపడానికి అధికారులందరూ కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ కార్తీక్ డిఆర్ఓ రాము నాయక్, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## ప్రత్యామ్నాయ పంటలకు మంచి వ్యవసాయ పద్ధతులకు ప్రోత్సాహం లేదు

**- డా.ముచ్చుకోట సురేష్ బాబు**







**అనంతపురం పెన్ పవర్ అక్టోబర్ 27 :** పంటలలో వైవిధ్యత ఉంటే భూములు బాగుపడతాయి. వంటలలో వైవిధ్యత ఉంటే మనుషులు బాగుపడతారు. రైతులు ప్రతి అవకాశాన్ని అంది పుచ్చుకుంటున్నారు, సాంకేతికతను అన్వయించుకుంటున్నారు కానీ ప్రభుత్వం నుండి ప్రోత్సాహకం కరువయ్యింది. ప్రభుత్వం నుంచి రాయితీ, సబ్సిడీ, పంట నష్టం ఇన్సూరెన్స్, మార్కెట్ సౌకర్యం, నిల్వ చేసుకోవడానికి వేర్ హౌస్, కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు, ప్రాసెసింగ్ యూనిట్లు ఉంటే ఆదాయం అదే వస్తుంది. నేడు రైతులు వినూత్న ఆలోచనతో వివిధ రకాల పంటసాగు చేస్తూ కష్టపడితే సాధించలేనిది ఏది లేదు అని నిరూపిస్తున్నారు. ఇప్పుడున్నటువంటి టెక్నాలజీ ని ఉపయోగిస్తూ లాభాలను పొందుతున్నారు. ముఖ్యంగా కరువు ప్రాంతమైన రాయలసీమ ప్రాంతంలోని ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రైతులు ఫల సంప్రదాయ పంటలు పండించడం లో దేశానికి ఆదర్శంగా ఉన్నారు. ఇక్కడ పండించే చీని, బొప్పాయి, జామ, దానిమ్మ, అరటి, మామిడి, ఖర్బుజా, దోస అంజీర పండ్లలో ఉన్న మాధుర్యం మిగతా ప్రాంతాల పండ్లకు రుచిలో స్పష్టంగా కనపడుతుంది.

గుత్తి ప్రాంతంలో మంచి వ్యవసాయ పద్ధతులు ఆరోగ్య అలవాట్లు ప్రజలకు చేరువ చేయడంలో గౌతమ బుద్ధ అభివృద్ధి సమాఖ్య శిక్షణ తరగతులు నిర్వహించింది. గ్రామీణ ఆవిష్కరణలను ప్రోది చేస్తూ వాటికి పేటెంట్ వచ్చే విధంగా పల్లె సృజన, జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థలతో కలిసి పనిచేస్తుంది. గుత్తి మండలం లో మొదటి సారిగా కేంద్రం ప్రవేశ పెట్టిన మధు క్రాంతి పథకం కింద దాదాపు 50 తేనె బాక్సులు తేనె ప్రాసెసింగ్ పనిముట్లతో దాదాపు మూడు లక్షలు ఖర్చు చేసి పలుమార్లు హార్టికల్చర్ అధికారులకు విన్నవించుకున్నా కనికరించే నాథుడే లేడు. రైతులు వివిధ రకాలైనా పంటలు సాగుచేస్తూ ఆరుగాలం కష్టపడితే నోటి కాడికి రావడం లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లా గుత్తి మండలం వన్నెదొడ్డి గ్రామానికి చెందిన అంబటి రామకృష్ణ మొట్టమొదటి సారిగా అంజీర పంట సాగు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. తనకున్న నాలుగు ఎకరాల పొలంలో 12 లక్షల రూపాయల పెట్టుబడితో అంజీర పంట సాగు చేస్తున్నాడు. అంజీర్ చెట్లు పెట్టి ఆరు నెలలవుతుంది, తొమ్మిది నెలలు పోతే పండ్లు వచ్చే అవకాశం ఉంది. అంతర్ పంటగా బంతి పూలు సాగుచేస్తున్నారు. బంతి పూలు ఇక్కడ మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో డోన్ కర్నూలు ప్రాంతాలకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంజూర్ పురాతన పండ్లలో ఒకటి. ఇది చిన్న వక్రీకృత ట్రంక్తో చిన్న నుండి మధ్యస్థ చెట్టు వరకు ఆకురాల్చే చెట్టు. తినదగిన పండు ఒక బహుళ పండు సియో కోనీయం (పుష్పించే ఒక రూపం దీనిలో ఒక బోలుగా ఉన్న రెసెప్టాకిల్ లోపలి గోడపై పూలు ఉంటాయి). పండు ఒక కండకలిగిన బోలు రెసెప్టాకిల్ను కలిగి ఉంటుంది,ఇది ఉష్ణమండల మరియు ఉపఉష్ణమండలంలో పెంచవచ్చు, కానీ తక్కువ తేమతో కూడిన ఉష్ణమండలంలో బాగా పని చేయదు మరియు పుష్పించే మరియు ఫలాలు కాసే సమయంలో ఎత్తైన ప్రదేశాలలో మరియు తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో పెంచవచ్చు. ఇది శీతాకాలంలో నిద్రాణంగా ఉంటుంది అక్టోబర్లో కొత్త వృద్ధిని కలిగిస్తుంది. అధిక నాణ్యత గల పండ్ల కోసం, ఫలాలు కాస్తాయి సమయంలో వాతావరణం కొద్దిగా వెచ్చగా ఉండాలి. నీటిపారుదల శుష్క, పాక్షిక శుష్క ప్రాంతాలు అంజీర్కు మంచివిగా పరిగణించబడతాయి. అంజూర పండు ఆవిర్భవించిన పుష్పగుచ్ఛం పెద్ద సంఖ్యను కలిగి ఉంటుంది. లోపలి వైపు పువ్వులు. అత్తి పండు యొక్క శిఖరం వద్ద ఒక కన్ను అని పిలువబడే ఒక చిన్న ద్వారం ఉంది, ఇది సాధారణంగా బ్రాక్ట్లతో కప్పబడి ఉంటుంది- పూనా, కౌనార్డియా, మిషన్ కడోటా, బ్రౌన్ టర్కీ. కాలిమిర్నా. వర్షాకాలంలో జూన్ నుండి అక్టోబర్ వరకు 6 మీటర్ల అంతరంలో తయారు చేసిన చతురస్రాకార పద్ధతిలో 60 సెం.మీ క్యూబ్ గుంతలలో నాటడం జరుగుతుంది. స్థలం నుంచి ప్రదేశానికి, నేల నుంచి నేల, వివిధ రకాలుగా మారుతూ ఉంటుంది. అంతరం 3×3ఎం నుండి 8×8ఎం వరకు ఉంటుంది కానీ 6×6ఎం సముచితంగా కనిపిస్తుంది. అంజీర్ మొక్కలను మొదటి నుండి ఎరువులు వేయాలి. ఒక సంవత్సరం వయస్సు ఉన్న చెట్టుకు 10 కిలోల ఎఫ్వైఎమ్ మరియు 170 గ్రా అమ్మోనియం సల్ఫేట్ ఇవ్వాలి మరియు 7 కిలోల ఎఫ్వైఎమ్ మరియు 170 గ్రా అమ్మోనియం సల్ఫేట్ ప్రతి సంవత్సరం 5 సంవత్సరాల వరకు క్రమంగా పెంచాలి. ఎరువులు మరియు ఎరువులు ట్రంక్ చుట్టూ 45-60 సెంటీమీటర్ల రేడియల్ దూరం మధ్య వ్యాప్తి చెందుతాయి మరియు త్రవ్వడం ద్వారా పార సహాయంతో కలుపుతారు. అంజీర్ కరువును తట్టుకుంటుంది, కానీ వేసవిలో, పండ్లు అభివృద్ధి చెందుతున్నప్పుడు మరియు పండినప్పుడు, నెలకు రెండుసార్లు నీటిపారుదల ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది పెద్ద మరియు తీపి పండ్లను ఇస్తుంది. అధిక నీటిపారుదల పండ్లు నిష్క్రియంగా చేస్తుంది. పండ్లు పక్వానికి వచ్చే సమయంలో కొన్ని సార్లు ఎక్కువ నీటిపారుదల పండ్ల పగుళ్లకు కారణమవుతుంది, కాబట్టి అధిక నాణ్యత గల పంటకు న్యాయమైన నీరు త్రాగుట మంచిది. అంజూర ఏడాదికి రెండు పంటలు పండుతుంది. చెట్లు రెండవ సంవత్సరం నుంచి ఫలాలను ఇవ్వడం ప్రారంభించవచ్చు, కానీ వాణిజ్యపరంగా 3 సంవత్సరాల నుండి ప్రారంభమై 40 సంవత్సరాల వరకు పంట కొనసాగుతుంది.

## పెన్నా నది తీర ప్రాంత ప్రజలకు మంతా తుఫాను హెచ్చరిక..!!




**కడప పెన్ పవర్ అక్టోబర్ 27 :** మైలవరం రిజర్వాయర్ నందు ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 6.076 టీఎంసీలు ఉన్నది. గండికోట రిజర్వాయర్ నుండి 5000 క్యూసెక్కులు నీరు వచ్చి చేరుతున్నది కావున మైలవరం రిజర్వాయర్ కెపాసిటీ 6.3 టీఎంసీలకు చేరువలో ఉన్నది. ఇందుమూలంగా యావత్ ప్రజానీకానికి పెన్నా నది తీరం వెంబడి ఉన్న రైతులకు అధికారులకు విద్యార్థులకు మత్స్యకారులకు రజకులకు తెలియజేయడ మేమనగా మంథ తుఫాను తీవ్రత ను పరిగణనలోకి తీసుకొని మైలవరం స్పిల్ వే నుండి నీటిని 4300 క్యూసెక్కుల చొప్పున ప్రస్తుతం ఏడు గంటలకి పెన్నా నదికి విడుదల చేస్తున్నారు. కాబట్టి ఈ విషయాన్ని అధికారులు ప్రజలు అందరూ గమనించి అప్రమత్తతో వ్యవహరించి మంతా తుఫాను ప్రభావాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని తెలియజేయడమైనది.

### లీగల్ ఎయిడ్ ప్యానల్ లాయర్స్ విధులు పై రివ్యూ మీటింగ్




**కడప పెన్ పవర్ అక్టోబర్ 27 :** జి.కబర్ధి, చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కర్నూలు వారి సూచనల మేరకు కమిటీ మెంబర్స్ అయినా మొదటి అదనపు జిల్లా జడ్జి పి. కమలాదేవి, బి. లీలా వెంకట శేషాద్రి, సెక్రటరీ–కం–సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కర్నూలు, మురళీ మనోహర్ వారు కర్నూలు కోర్టు కాంపౌండ్ లో గల న్యాయ సేవా సదన్ నందు " ప్యానల్ లాయర్స్ విధులు పై రివ్యూ మీటింగ్" నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ప్యానల్ లాయర్స్ విధులు, చట్టపరమైన సలహాలు, కేసుల వివరాలు మరియు పరిష్కారము మొదలగు అంశాలను వివరించారు.అలాగే కేసుల యొక్క స్థితిగతులను తెలుసుకొని వాటిని ఏ విధంగా త్వరిత గతిన పరిష్కరించాలో అనే దానిపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరాం, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సులోచన పాల్గొన్నారు.

### జిల్లాకు చేరుకున్న షెడ్యూల్డ్ కులముల సంక్షేమం కొరకు ఏర్పాటు చేయబడిన ఆంధ్రప్రదేశ్ శాసన సభ కమిటీ బృందం





**అనంతపురం పెన్ పవర్, అక్టోబర్, 27 :** అనంతపురం జిల్లా పర్యట నలో భాగంగా షెడ్యూల్డ్ కులముల సంక్షేమం కొరకు ఏర్పాటు చేయబడిన ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ కమిటీ బృందం సోమవారం రాత్రి అనంతపురం ప్రధాన కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా సదరు బృందా నికి ఇంచార్జ్ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కుష్బూ కొఠారి, ఏ ఎస్ డబ్ల్యూలు రాము నాయక్ రామ్మోహన్ శ్రీనివాసులు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు తదితరులు మొక్కలను అందజేసి ఘన స్వాగతం పలికారు. స్థానిక రైల్వే స్టేషన్ దగ్గరగా ఉన్న ఓ ప్రైవేట్ హోటల్ లో కమిటీ బృందం బస చేసింది. శాసన కమిటీ అధ్యక్షులు కుమారరాజావర్ల, శాసనసభ్యులు ఎంఎస్ రాజు, కొలిక పూడి శ్రీనివాసరావు, తాటిపర్తి చంద్రశేఖర్, రోషన్ కుమార్ మరియు ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ జిల్లా పర్యటలో భాగంగా విచ్చేశారు. రేపటి ఉదయం మంగళవారం 9.30 నుండి 11 గంటలకు అనంతపురం నగరంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో షెడ్యూల్ కులాల కు చెందిన ప్రజలు మరియు షెడ్యూల్డ్ కుల సంఘాల నాయకులు ప్రతినిధులు మరియు కార్యకర్తలు ఇచ్చే వినతి పత్రాలు కమిటీ బృందం స్వీకరిస్తుంది. ఆ తర్వాత జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని రెవెన్యూ భవన్ లో అధికారులతో సమావేశం నిర్వహించి సంక్షేమ ,అభివృద్ధి పథకాల అమలు పెండింగ్ ఉన్న అట్రాసిటీ కేసులు, సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ల పనితీరు, ప్రభుత్వ సేవలలో భాగంగా రిజర్వేషన్ల అమలు మరియు షెడ్యూల్డ్ కులాల సంబంధించిన ఇతర అంశాలను కమిటీ బృందం ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుంది.




## "కడప రిమ్స్ ఆవరణంలో గల జిల్లా సత్వర చికిత్స కేంద్రం/ జిల్లా బాల భవిత కేంద్రం విజిట్ మరియు న్యాయ విజ్ఞాన సదస్సు"






**కడప పెన్ పవర్ అక్టోబర్ 27 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా గౌరవ డాక్టర్ సి.యామిని చైర్మన్–కం–జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కడప వారి సూచనల మేరకు గౌరవ శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ–కం–సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారు "కడప రిమ్స్ ఆవరణంలో గల జిల్లా సత్వర చికిత్స కేంద్రము / జిల్లా బాల భవిత కేంద్రము విజిట్ మరియు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టినప్పటి నుండి 18 సంవత్సరాల లోపు గల పిల్లలకు పుట్టుకతో వచ్చే ఎదుగుదల లోపాలకు సంబంధించిన పిల్లల తల్లిదండ్రులు ఇలాంటి చికిత్స సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలి, "కడప రిమ్స్ ఆవరణంలో గల జిల్లా సత్వర చికిత్స కేంద్రము/జిల్లా బాల భవిత కేంద్రము ఎన్నో సదుపాయాలు గల ఈ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి, ప్రత్యేక పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి, ప్రస్తుత సమాజంలో ప్రత్యేక పిల్లలు కూడా ఉన్నత స్థానాలను అధిరోహిస్తున్నారు.

వీరి కోసం గౌరవ జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నల్సా) వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2024, జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ (నల్సా) వారి మానసిక అనారోగ్యం ఉన్న వ్యక్తులు మరియు మేధో వైకల్యాలున్న వ్యక్తులకు చట్టపరమైన సేవలు పథకం 2024 పథకములను ప్రవేశపెట్టినది, సద్వినియోగం చేసుకోవాలి.

వికలాంగుల హక్కుల చట్టం 2016, మానసిక ఆరోగ్యం సంరక్షణ చట్టం 2017, జాతీయ మానసిక ఆరోగ్య విధానం 2014, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్లైన్ నెంబర్ 1098, దివ్యాంగజన్ హెల్ప్ లైన్ నెంబర్ 14456, ఉచిత న్యాయ సహాయము మొదలగు అంశాలను వివరించారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చును అన్నారు. అనంతరం వెల్ఫేర్ ఆఫ్ డిఫరెంట్ల ఏబుల్ ట్రాంజెండర్ అండ్ సీనియర్ సిటిజన్ వారి సహకారంతో డాక్టర్లతో ఇద్దరికీ చెవిటి పరీక్షలు నిర్వహించి రెండు హియరింగ్ మిషన్లను అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫ్ డిఫరెంట్ల ఏబుల్ ట్రాంజెండర్ అండ్ సీనియర్ సిటిజన్ సూపరిండెంట్, జిల్లా సత్వర చికిత్స కేంద్రము / జిల్లా బాల భవిత కేంద్రం డాక్టర్లు, సిబ్బంది, పారా లీగల్ వాలంటరీలు, తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

## ఆందోళన అవసరం లేదు, అప్రమత్తంగా ఉండాలి..!


### టెలికాన్ఫిరెన్స్ ద్వారా జిల్లాస్థాయి అధికారులను సూచించిన జిల్లా ఇంచార్జి కలెక్టర్ అదితి సింగ్




**కడప, పెన్ పవర్ అక్టోబర్ 27 :** మంథా తుఫాన్ ప్రభావం ప్రారంభం అయిన నేపథ్యంలో.. ఆందోళన అవసరం లేదని, అప్రమత్తంగా ఉండాలని.. ఎలాంటి విపత్తులు ఎదురైనా ఎదుర్కొనేం దుకు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ అదితి సింగ్ జిల్లా అధికారులకు సూచించారు. మంథా తుఫాను పరిస్థితులను ఎదుర్కొనే చర్యలు, సంసిద్ధతపై.. జిల్లా ఇంచార్జి కలెక్టర్ అదితి సింగ్ జిల్లా స్థాయి అధికారులతో సోమవారం సాయంత్రం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పంట నష్టం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. మండలాల వారీగా చెరువు కట్టలు, కాలువ గట్ల పరిరక్షణపై దృష్టి పెట్టాలని, వాగులు, వంకలు, కుంటల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అధిక వర్షాలు కురవడం వలన రిజర్వాయర్లు, నదులు, వాగులు, వంకలు, చెరువులు.. ఉప్పొంగే అవకాశాలు ఉన్నందున.. పరివాహక ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ అవసరమైన సహాయక చర్యలను అందించేందుకు సంబందిత సిబ్బందితో 24 గంటలు సిద్ధంగా ఉండాలన్నారు. ఇరిగేషన్ అధికారులు, ఇంజనీర్లు చేపట్టాల్సిన భద్రతా చర్యలపై అలర్ట్ గా ఉండాలన్నారు. జిల్లా అధికారులు మొదలు నియోజకవర్గ, మండల, సచివాలయ, గ్రామ స్థాయి వరకు ప్రతి అధికారి సిబ్బంది వారి వారి కార్య స్థానాలలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అన్ని రెవెన్యూ డివిజన్ల పరిధిలో పోలీసు, అగ్నిమాపక సిబ్బందితో పాటు.. రెస్క్యూ టీమ్ ను కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన పంటల సాగు చేసే రైతులను అప్రమత్తం చేయాలని పంట నష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై రైతులను అప్రమత్తం చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడా పాడి సంరక్షణకు, పశు నష్టం జరగకుండా పశు సంవర్ధక సహాయకులు బాధ్యత వహించా అలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయం అయితే.. వెంటనే దానిని పునరుద్ధరించేలా చర్యలు చేయ పట్టాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి జిల్లాలోని అన్ని ఏరియా ఆసుపత్రులు, పీహెచ్ సిలలో సకాలంలో డాక్టర్లు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అందుబాటులో ఉండాలని, బాలింతలు, గర్భిణీలను సురక్షితమైన ప్రాంతాల్లో ఉంచి ప్రత్యేక సంరక్షణ అందివ్వాలన్నారు. అవసరమైన మందులను అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు చేపడుతున్న ముందస్తు సంసిద్ధత ఏర్పాట్లపై ఇంచార్జి కలెక్టర్ సమీక్షించారు. అత్యవసర సహాయ సమాచార నిమిత్తం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని కంట్రోల్ రూంతో పాటు కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవో కార్యాలయాల్లో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్ నెంబర్లను సద్వినియోగం చేసుకునేలా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

## మన ఇల్లు, పనిచేసే వాతావరణం సంతోషంగా ఉండాలంటే మనం బాహ్య విషయాలపై ఆధారపడాల్సిందేనా?





**కడప పెన్ పవర్ అక్టోబర్ 27 :** వాస్తు: నిర్మాణ శాస్త్రం ఒక వ్యక్తి వ్యాపారంలో చాలా పురోగతి సాధించి, ఒక పెద్ద నగరంలో, సముద్రతీరాన భూమిని కొనుగోలు చేసుకుని, విలాసవంతమైన ఒక పెద్దఇల్లు నిర్మించాడు. అప్పటికే ఆ స్థలంలో అందమైన ఒక స్విమ్మింగ్ పూల్, పెరట్లో చాలా పాతదైన ఒక మామిడి చెట్టు ఉన్నాయి. అతని భార్యకు మామిడిపండ్లు అంటే చాలా ఇష్టం కాబట్టి, ఆ మామిడి చెట్టు కారణంగానే ఆ స్థలాన్ని కొన్నాడు. కొంత కాలం తర్వాత ఇంటి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్న తరుణంలో కొందరు స్నేహితులు వాస్తు నిపుణుడి సలహా తీసుకోమని అతనికి సూచించారు. అతను అలాంటివాటిని నమ్మకపోయినా, తన స్నేహితుల పట్టుదలతో అంగీకరించి, ఆ నగరంలో 30 సంవత్సరాలుగా బాగా ప్రాచుర్యం పొందిన ఒక వాస్తు నిపుణుడిని సంప్రదించాడు. నిర్ణీత రోజున, ఆ వ్యక్తి వాస్తు నిపుణుడిని ఆఫీసు నుండి తన కారులో ఎక్కించుకుని నిర్మాణంలో ఉన్న తన కొత్త ఇల్లు చూపించటానికి తీసుకెళ్లాడు. వెళ్తున్నదారిలో వాళ్లను ఏదైనా కారు ఓవర్ టేక్ చేయడానికి ప్రయత్నించినప్పుడల్లా, అతను దారి ఇచ్చేవాడు. వాస్తు నిపుణుడు నవ్వుతూ, "నువ్వు చాలా సురక్షితంగా డ్రైవ్ చేస్తున్నావు", అన్నాడు. అతను కూడా నవ్వుతూ ఇలా బదులిచ్చాడు, "సాధారణంగా ప్రజలు ఏదైనా అత్యవసరమైన పని ఉన్నప్పుడే ఓవర్ టేక్ చేయడానికి ప్రయత్నిస్తారు, కాబట్టి మనం వారికి దారి ఇవ్వాలి". వాళ్ళు ఇంటి దగ్గరికి వచ్చేసరికి రోడ్డు కాస్త ఇరుకుగా మారడంతో కారుని కొంచెం నెమ్మది చేసాడు. అకస్మాత్తుగా, ఒక పిల్లవాడు ఒక వీధిలో నుండి రహదారిపైకి పరిగెత్తాడు. అతను నవ్వుతూ, వారి కారు ముందు నుండి వేగంగా పరుగెత్తాడు. ఆ వ్యక్తి వేగం పెంచకుండా అలాగే వెళ్తూ, ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్లుగా ఆ వీధి వైపుకు చూశాడు. అప్పుడు అకస్మాత్తుగా, మరొక పిల్లవాడు అదే వీధిలో నుండి బయటకు రహదారిపైకి పరిగెత్తుకుంటూ వచ్చి, వారి కారును దాటాడు, బహుశా మొదటి పిల్లవాడ్ని వెంబడిస్తున్నట్లుగా. నిపుణుడు చాలా ఆశ్చర్యపోయాడు, "మరో పిల్లవాడు బయటకు వస్తాడని మీకు ఎలా తెలుసు?" అనడిగాడు. అతను చాలా తేలికగా ఇలా చెప్పాడు, "పిల్లలు తరచుగా ఒకరి వెనుక ఒకరు పరిగెడుతూ ఉంటారు. జట్టు లేకుండా ఒక పిల్లవాడే ఇలా పరుగులు పెట్టడం దాదాపు అసాధ్యం." దీనికి నిపుణుడు బిగ్గరగా నవ్వుతూ, "మీరు నిస్సందేహంగా చాలా క్రమబద్ధతతో, స్పష్టమైన తలంపుతో ఉన్నారు", అన్నాడు. ఇంటికి చేరుకున్న తర్వాత ఇద్దరూ కారు దిగారు. అప్పుడే ఇంటి వెనుక నుండి 7–8 పక్షులు వేగంగా ఎగురుతూ కనిపించాయి. అది చూసి ఆ వ్యక్తి నిపుణుడితో, "మీకు అభ్యంతరం లేకపోతే, మనం ఇక్కడే కాసేపు ఉందామా?" అన్నాడు. నిపుణుడు కారణం తెలుసుకోవాలనుకున్నాడు. "కొందరు పిల్లలు చెట్టు నుండి మామిడి పండ్లను దొంగిలిస్తూ ఉండవచ్చు. మన ఆకస్మిక రాక వారిలో భయాందోళనలను కలిగిస్తుంది, వారు భయపడి త్వరగా దిగడానికి ప్రయత్నిస్తే, కొంతమంది పిల్లలు చెట్టుపై నుండి పడి తమని తాము గాయపరచుకోవచ్చు", అని ఇంటి యజమాని చెప్పాడు.

నిపుణుడు కాసేపు మౌనంగా ఉండి, తర్వాత మృదువుగా, నియంత్రిత స్వరంతో, " మిత్రమా, ఈ ఇంటికి వాస్తు తనిఖీలు, నివారణలు అవసరం లేదు" అన్నాడు. ఆ వ్యక్తి చాలా ఆశ్చర్యంతో, "ఎందుకు అలా?" అని అడిగాడు. ఆ నిపుణుడు ఇలా సమాధానమిచ్చాడు, "చాలా సున్నితత్వంతో, చుట్టుపక్కల ప్రజలందరి మంచి గురించి ఆలోచించే మీలాంటి వ్యక్తి ఎక్కడ ఉంటే, ఆ స్థలం లేదా ఆస్తి, వాస్తు నియమాల ప్రకారం చాలా పవిత్రంగా, ఆహ్లాదకరంగా, ఫలవంతంగా ఉంటుంది." మన మనస్సు, మెదడు ఇతరుల ఆనందానికి, శాంతికి ప్రాధాన్యత ఇవ్వడం ప్రారంభించినప్పుడు, మన చుట్టూ ఉన్న ఇతరులకే కాకుండా, మనకు కూడా మానసిక ప్రయోజనాలు, శాంతి, ఆనందం లభిస్తాయి. ఒక వ్యక్తి ఎల్లప్పుడూ ఇతరుల శ్రేయస్సు గురించి ఆలోచించినప్పుడు, తెలియకుండానే పుణ్యాన్ని పొందుతాడు, దాని కారణంగా ఇతరులు కూడా ప్రయోజనం పొందుతారు. అతను జ్ఞానోదయం పొందుతాడు. సంతోషకరమైన జీవితం కోసం మనం బాహ్య వాతావరణం, శాస్త్రసమ్మతమైన నియమాలపై ఆధారపడకుండా మనలో అటువంటి లక్షణాలను కూడా పెంపొందించుకోవాలి. హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం ప్రేమ, అంగీకారం, వినయం, సేవ, కరుణ, సానుభూతి, ముఖ్యంగా, ఒకరి అస్తిత్వపు ఉన్నత లక్ష్యాన్ని గుర్తించడం వంటి అనేక లక్షణాలను అభివృద్ధి చేస్తుంది. ??

దాజీ

హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం?

## అవినీతి నిర్మూలనపై ప్రజలకు అవగాహన

**కడప పెన్ పవర్ అక్టోబర్ 27 :** ఇన్స్పెక్టర్, ఏ.సి.బి., కడప వారు సోమవారం, తేదీ. 27.10.2025న జిల్లా రెవిన్యూ అధికారి యం. విశ్వేశ్వర నాయుడు గారిని మరియు పరిపాలనాధికారి, కలెక్టర్ కార్యాలయం, కడప గారిని కలిసి, అవినీతి నిర్మూలనకు సంబంధించి గోడపోస్టర్లను అందజేశారు. మరియు ఆ పోస్టర్లను జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయ శాఖాధిపతులకు పంపించి, వారి వారి కార్యాలయాలలో విరివిగా అతికించవలసిందిగా, ప్రజలకు అవగాహన కల్పించి అవినీతి నిర్మూలనకు సహకరించవలసిందిగా ఆయన కోరారు. దీని పై వై.యస్.ఆర్ కడప జిల్లా లోని అన్ని ప్రభుత్వ శాఖధిపతులకు తగు సూచనలు జరిచేయడమైంది.

## పిజిఆర్ఎస్‌కు 282 దరఖాస్తులు

### – జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




**నంద్యాల, పెన్ పవర్ అక్టోబర్ 27 :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను నాణ్యతతో ప్రజలు సంతృప్తి చెందే రీతిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్ డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొని అర్జీలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ అర్జీదారులు సమర్పించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా చదివి, నాణ్యతతో నిర్ణీత కాల పరిమితిలోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గత రెండు వారాల్లో రీ ఓపెన్ అయిన దరఖాస్తులు 481 ఉన్నాయని... ప్రధానంగా రెవెన్యూ, సర్వే విభాగాల్లో అధికంగా ఉన్నాయని వెంటనే స్పందించి క్లియర్ చేయాలని తాసిల్దార్లు, ఆర్డిఓలను కలెక్టర్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ఫీడ్బ్యాక్ స్వీకరణ 39 శాతం మాత్రమే ఉందని 50 శాతానికి పెంచేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే గడువులోపు పరిష్కరించాల్సిన సమస్యలపై కూడా ప్రత్యేక దృష్టి సారించి క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే పెండింగ్లో ఉన్న ఆడిట్ పై దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని సమస్యలు:

1)ప్యాపిలి మండలం గుడిపాడు గ్రామానికి చెందిన పి. సుగణ వారి తండ్రి పేరున సర్వే నంబర్ 594లో రెండు ఎకరాల విస్తీర్ణంలో పొలం ఉందని, ఆ భూమిని కొంతమంది ఆన్లైన్‌లో తమ పేరుతో మార్చుకున్నారని, సదరు భూమిని పరిశీలించి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు.

2)పగిడ్యాల మండలం వీరాపురం గ్రామానికి చెందిన ఎస్. నరసరావుకు చెందిన భూమిని నీలం సంజీవ రెడ్డి శ్రీశైలం ప్రాజెక్టు కోసం స్వాధీనం చేసుకున్నారని, అందుకు నష్టపరిహారం కింద ఉద్యోగావకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.


3)ఆళ్లగడ్డ మండలం ఆర్. పాపంపల్లికి చెందిన బి. మోహన్ రెడ్డికి పి. చింత కుంటలో ఒక ఎకరా భూమి ఉందని, అయితే ఆన్లైన్‌లో 90 సెంట్ల భూమి మాత్రమే నమోదైందని, మిగతా భూమిని పరిశీలించి ఆన్లైన్‌లో చేర్చాలంటూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు అందజేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 282 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు సమర్పించారు. అన్ని అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ డిఆర్ఓ జారీ చేసారు.

## కడప నగరపాలక సంస్థ కమిషనర్ పర్యటన





**కడప పెన్ పవర్ అక్టోబర్ 27 :** రాబోయే కడప పెద్ద దర్గా ఊరుసు ఉత్సవాలను పురస్కరించుకొని, కడప నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మనోజ్ రెడ్డి ఈ రోజు కడప నగరంలోని పెద్ద దర్గాకు వెళ్లే మార్గాల సుందరీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మొదట మాసపేట సర్కిల్ నుండి కాలినడకన ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ విభాగ అధికారులతో కలిసి దర్గా వైపుగా పర్యటించారు. మార్గమధ్యంలో డ్రెయినేజ్ మరమ్మత్తులు, రోడ్లలో ఉన్న గుంతలు (పాట్‌హోల్స్) మరియు పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి వాటిని తక్షణమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తదనంతరం వై.వి. స్ట్రీట్‌లో మరియు వన్ టౌన్ సర్కిల్ వద్ద పర్యటించి అక్కడ ఉన్న సమస్యలను పరిశీలించి, అవి త్వరితగతిన పరిష్కరించాలంటూ అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ పర్యటన లో అడిషనల్ కమీషనర్ రాకేష్ చంద్రం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు విజయ్ కుమార్, ధనలక్ష్మి, హార్టికల్చర్ నాగమణి, క్రిష్ణ కుమార్‌లు లక్ష్మి నారాయణ, శ్రీనివాసులు రెడ్డి, పూర్ణ చంద్ర శేఖర్ లు, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు నాగ సుబ్బయ్య, పూజిత్ రెడ్డి ఆఫ్జల్, సదా శివ మరియు సచివాలయం సిబ్బంది పాల్గున్నారు.



# ప్లాస్టిక్‌ను విడనాడి పర్యావరణాన్ని కాపాడుకుందాం






★ అవగాహన కార్యక్రమంలో నందవరపు సోములు పిలుపు

**గోపాలపట్నం, పెన్ పవర్, అక్టోబర్ 27 :** పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా భూమి భవిష్యత్తును కాపాడగలమని పద్మనాభ నగర్ గ్రామాభ్యుదయ యువజన సేవా సంఘం అధ్యక్షులు నందవరపు సోములు పిలుపునిచ్చారు. గ్రామాభ్యుదయ యువజన సేవా సంఘం స్థాపనకు 37 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామంలో పర్యావరణ సంరక్షణపై ప్రజల్లో చైతన్యం పెంచడమే లక్ష్యంగా చేపట్టబడింది.

ఈ సందర్భంగా అధ్యక్షులు నందవరపు సోములు మాట్లాడుతూ "ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలిగే నష్టం తీవ్రమైనది. మన ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం, నిషేధిత ప్లాస్టిక్ సంచులను పూర్తిగా వాడకపోవడం, వ్యర్థాలను శాస్త్రీయంగా తొలగించడం వంటివి ప్రతి ఒక్కరి బాధ్యత" అని అన్నారు. గౌరవ అధ్యక్షులు సాలాపు శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో యువత ముందుండాలని, ప్రకృతి సంరక్షణకు సమాజం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులు కంపర అప్పారావు "మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని పరిరక్షించడంలో కూడా శ్రద్ధ అవసరం. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెంపొందించే కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టాలి" అన్నారు. ప్రధాన కార్యదర్శి రొంగలి ప్రసాద్ మాట్లాడుతూ

"నాణ్యతలేని ప్లాస్టిక్ సంచులతో పాటు పేపర్ టీ గ్లాసులు కూడా ఆరోగ్యానికి హానికరం. వీటి వినియోగం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధుల ముప్పు ఉంది. ప్రజలకు ఈ విషయంపై అవగాహన కల్పించాలి" అన్నారు. ఈ కార్యక్రమంలో వల్లూరి జగదీష్ చంద్రశేఖర్, కంచిపాటి వెంకటరమణ, కట్ట పెంటయ్య, కంపర కనకరాజు తదితరులు ప్రసంగించి పర్యావరణ పరిరక్షణలో గ్రామస్థుల పాత్రను వివరించారు. సంఘం 37 ఏళ్లుగా గ్రామ అభ్యుదయానికి, సామాజిక సేవలకు నడుం బిగించి పనిచేస్తున్నందుకు అధ్యక్షుడు నందవరపు సోములును సభ్యులు అభినందించారు.

అనంతరం గ్రామంలో ప్లాస్టిక్ వ్యతిరేక ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం గ్రామీణ స్థాయిలో పర్యావరణ అవగాహనను పెంపొందించడానికి ఒక మంచి ఉదాహరణ. ప్లాస్టిక్ నిషేధం, వృక్షారోపణ, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ వంటి అంశాలను సమన్వయంగా చర్చించడం ప్రత్యేకత. యువజన సంఘం వంటి స్థానిక సంస్థలు సామాజిక మార్పుకు శక్తివంతమైన వేదికలుగా నిలుస్తున్నాయి. ఇలాంటి చైతన్య కార్యక్రమాలు గ్రామ స్థాయిలో నిరంతరంగా కొనసాగితే పర్యావరణ పరిరక్షణలో దీర్ఘకాలిక ఫలితాలు సాధ్యమవుతాయి. "ప్లాస్టిక్‌ను విడనాడండి ౹ పర్యావరణాన్ని పరిరక్షించండి" అన్న నినాదం కేవలం మాటగాక, ప్రతి పౌరుడి జీవన విధానంగా మారాలని, ప్రకృతిని కాపాడటం మనందరి బాధ్యత అని ఈ కార్యక్రమం స్పష్టం చేసింది.

# వాయుగుండం నేపథ్యంలో పెందుర్తి ప్రజలకు ఎమ్మెల్యే పంచకర్ల విజ్ఞప్తి



**పెందుర్తి, పెన్ పవర్, అక్టోబర్ 27 :** ప్రస్తుత వాయుగుండం, మోంథా తుఫాను హెచ్చరిక నేపథ్యంలో పెందుర్తి నియోజకవర్గ ప్రజలందరూ అప్రమత్తంగా, ధైర్యంగా ఉండాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక అత్యవసర ప్రెస్ నోట్ విడుదల చేశారు. ఎమ్మెల్యే రమేష్ బాబు పేర్కొంటూ వర్షాలు, గాలులు తీవ్రంగా ఉండే అవకాశమున్నందున ప్రజలు తప్పనిసరిగా తమ ఇళ్లలోనే ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని సూచించారు. "రోడ్లపై నీరు చేరడం, విద్యుత్ వైర్లు తెగిపడడం వంటి ప్రమాదాలు ఉండే అవకాశం ఉంది. కనుక జాగ్రత్తలు తప్పనిసరి," అని ఆయన హెచ్చరించారు. మత్స్యకార గ్రామాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. తుఫాను పరిస్థితులు పూర్తిగా సద్దుమణిగే వరకు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని సూచించారు. "జీవితమే ముఖ్యం, వేట ఎప్పుడైనా చేయొచ్చు" అని గుర్తుచేశారు. ఎక్కడైనా చెట్లు కూలడం, వరద నీరు చేరడం, విద్యుత్ సరఫరా నిలిచిపోవడం వంటి సమస్యలు తలెత్తిన వెంటనే స్థానిక అధికారులు లేదా సిబ్బందికి తెలియజేయాలని ప్రజలకు సూచించారు. "ఇది ఒక ప్రకృతి విపత్తు, అందరూ బాధ్యతగా వ్యవహరించి ఒకరికి ఒకరు సహకరించాలి," అని ఆయన అన్నారు. ప్రజల్లో భయం వ్యాప్తి చెందకుండా నాయకులు ధైర్యం నింపేలా వ్యవహరించాలని సూచించారు. పెందుర్తి నియోజకవర్గంలోని బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి శ్రేణుల నాయకులు మూడు రోజుల పాటు తమ తమ గ్రామాలు, వార్డుల పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని పంచకర్ల రమేష్ బాబు సూచించారు. సహాయక చర్యల్లో పాల్గొని, ప్రజల్లో అవగాహన కల్పించడమే కాక, మానసిక స్థైర్యం కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు. "మనందరం కలిసికట్టుగా ఉంటే ఏ తుఫానూ మన మనోబలాన్ని దెబ్బతీయలేదు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండి, జాగ్రత్తలు పాటించండి," అని రమేష్ బాబు గారు ప్రజలను ఉద్దేశించి విజ్ఞప్తి చేశారు.ం

# ముంపు ప్రమాద గ్రామాలపై సమీక్ష ముందస్తు చర్యలకు ఆదేశాలు

పద్మనాభం మండలంలో ప్రత్యేక అధికారి జ్ఞానవేణి పర్యటన





**పద్మనాభం,పెన్ పవర్, అక్టోబర్ 27 :**మెంథా తుఫాను ప్రభావంతో తీర ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో, పద్మనా భం మండలంలోని లోతట్టు ప్రాంతాలను మండల ప్రత్యేక అధికారి జ్ఞానవేణి సోమవా రం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె ముం పు ప్రమాదం ఉండే గ్రామాలను సందర్శించి, స్థానిక పరిస్థితులను తెలుసుకున్నారు. పునరా వాసం అవసరమయ్యే పరిస్థితులు తలెత్తిన పుడు తక్షణమే చర్యలు తీసుకునేందుకు రెవెన్యూ శాఖ, గ్రామస్థాయి సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆమె అధికారులను ఆదేశించారు.

తదనంతరం మండల కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో తహసీల్దార్ కే. ఆనంద రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ డి. శ్యామల తదితర అధికారులు పాల్గొన్నారు. జ్ఞానవేణి గారు సమావేశంలో మాట్లాడుతూ ప్రజల ప్రాణ రక్షణే ప్రాధాన్యం. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే గ్రామాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు తప్పనిసరిగా చేపట్టాలి" అని స్పష్టం చేశారు. అధికారులు ముంపు ప్రభావిత గ్రామాల పరిస్థి తులను సమీక్షించి, అవసరమైన సహాయక చర్యలను అమలు చేయాలని సూచనలు జారీ చేశారు.

# మెంథా తుఫాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్ బాబు

**చింతపల్లి పెన్ పవర్ అక్టోబర్ 27:-** మెంథా తుఫాను నేపథ్యంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని చింతపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్ బాబు విజ్ఞప్తి చేస్తున్నారు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అల్పపీడన ప్రభావం కారణంగా ఈదురు గాలులు, భారీ వర్షాలతో విపత్కర పరిస్థితులు చోటు చేసుకోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయరాదన్నారు.లోతట్టు ప్రాంతాల్లో గాని పాడుపడిన నిర్మాణాలు గానీ ఎవరూ ఉండరాదని, అత్యవసర సమయాలలో టోల్ ఫ్రీ నెంబర్లను సంప్రదించాలని సూచించారు. వారు .



# కే.జీ.హెచ్ కి 40 లక్షల విలువైన వైద్య పరికరాల అందజేత

ఎమ్మెల్యే వంశీకృష్ణ చేతులమీదగా రోటరీ క్లబ్ సేవా కార్యక్రమం










**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 27. :**విశాఖపట్నం కింగ్ జార్జ్ ఆసుపత్రి కు రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ ఆధ్వర్యంలో 40 లక్షల రూపా యల విలువైన ఆధునిక వైద్య పరికరాలను దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీని వాస్ చేతుల మీదగా అందజేశారు.ఈ సంద ర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన అనంతరం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, "రోటరీ క్లబ్ సమా జానికి సేవలందించే వేదికగా నిలుస్తోంది. ఈ సంస్థ చేపడుతున్న వైద్య, విద్యా కార్యక్రమాలు ప్రశంసనీయమైనవి" అని తెలిపారు. నియోజకవర్గంలో విద్యా రంగం, వైద్య రంగాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని, రోటరీ సభ్యులు పాఠశాలలు, కళాశాలలకు కూడా సహాయ సహకారాలు అందించాలని కోరారు.ఈ సందర్భంగా 2 వెంటిలేటర్లు, 10 సిరింజ్ పంపులు, 40 వీల్‌చైర్లు, 100 కాట్లు, 5 రెస్పి రేటరీ హ్యూమిడిఫయర్లు కేజీహెచ్‌కు అందజేశారు.

ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, రోటరీ క్లబ్ పెద్దలు శోభన్ ప్రకాష్, ప్రిన్సిపాల్ సంధ్యాదేవి, సభ్యులు రాంప్రసాద్, నహదా, కృష్ణకుమార్, జనసేన పార్టీ వార్డ్ అధ్యక్షురాలు యజ్ఞశ్రీ, కూటమి నేతలు జోగి రాజు, మహి, డిప్యూటీ సూపరింటెండెంట్ వాసవి లత, సీఎంఆర్వో శ్రీహరి, ఏవో మరియు పలు విభాగాల అధిపతులు, వైద్యులు పాల్గొన్నారు.

# "మెంథా తుఫాన్‌లో ప్రజలతో వాసుపల్లి వర్షంలోనూ సేవలతో ముందుకు"

★ లోతట్టు ప్రాంత ప్రజలకు నిత్యావసరాల పంపిణీ
★ మత్స్యకారులందరికీ 50 కేజీల రేషన్ ఇవ్వాలని డిమాండ్





**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 27 :**మెంథా తుఫాను ప్రభావంతో తీరప్రాంతాల్లో భారీ వర్షాలు, ఈదురుగాలులు కొనసాగుతున్న నేపథ్యంలో దక్షిణ నియోజకవర్గ మాజీ ఎమ్మె ల్యే, వైఎస్సార్సీపీ ఇంచార్జ్ వాసుపల్లి గణేష్ కుమార్ ప్రజలకు అండగా నిలిచారు. వర్షాన్ని లెక్కచేయకుండా తడుస్తూ, 35వ వార్డు లక్ష్మీన గర్ లోతట్టు ప్రాంత ప్రజలకు స్వయంగా నిత్యా వసరాలను అందించారు.వార్డ్ అధ్యక్షుడు అలు పున కనకరెడ్డి, సీనియర్ నాయకులు సమక్షం లో జరిగిన ఈ కార్యక్రమంలో 250 కుటుంబా లకు రూ.500 విలువచేసే కిట్లను పంపిణీ చేశా రు. ఇందులో మూడు కేజీల బియ్యం, కూరగా యలు, వంటనూనె, మాంసం వంటి నిత్యావస రాలు ఉన్నాయి.ఈ సందర్భంగా మాట్లాడిన వాసుపల్లి గణేష్ కుమార్,మెంథా తుఫాను తీరం దాటే సమయంలో ఈదురుగాలులు బలంగా వీస్తాయి. లోతట్టు ప్రాంత ప్రజలు, ముఖ్యంగా మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి. అవసరమైతే ఇంటి నుండి బయటకు రావద్దు. అందుకే ప్రజల అవసరాలు ఇంటి వద్దకే తీసుకెళ్తున్నాం అని అన్నారు.

తుఫాను సమయంలో ప్రజలకు సేవ చేయడం రాజకీయ ప్రయోజనం కోసం కాదని, ఇది మా నవతా ధర్మమని ఆయన స్పష్టం చేశారు. "మా నాయకుడు జగన్ మోహన్ రెడ్డి పిలుపుమేరకు వైఎస్సార్సీపీ కుటుంబం మొత్తం ప్రజలతో కలిసి ఉంది. ప్రభుత్వం పిలిస్తే సేవా సైనికుల్లా తుఫా ను పరిస్థితుల్లో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం అని తెలిపారు.తీరప్రాంత మత్స్యకా రుల పరిస్థితిని ప్రస్తావిస్తూ, ప్రభుత్వం ప్రతి మత్స్యకార కుటుంబానికి కనీసం 50 కేజీల బియ్యం, రేషన్ ఉచితంగా ఇవ్వాలి అని ఆయన డిమాండ్ చేశారు. దక్షిణ నియోజ కవర్గంలో ఎవరికైనా సహాయం అవసరమైతే నేను అందుబాటులో ఉంటాను" అని వాసుపల్లి అన్నారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, జిల్లా సెక్రటరీ అభిరెడ్డి అడివిషు, మాజీ కార్పొరేటర్ పచ్చిరపల్లి రాము, సౌత్ క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు సువార్త రాజు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సనపల రవీంద్ర భారత్, వార్డ్ అధ్యక్షులు పీతల వాసు, రాజా రెడ్డి, ముత్తబాతులు రమేష్, లండ రమణ తదితర వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

## కోహ్లీ, రోహిత్ మళ్లీ గ్రౌండ్‌లో కనిపించేది అప్పుడే .. 2027 వరల్డ్ కప్ ముందు టీమిండియా వన్డే షెడ్యూల్ ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియాతో మూడు వన్డే మ్యాచ్ ల సిరీస్ ముగిసింది. ఈ సిరీస్ తో టీమిండియా స్టార్ ప్లేయర్స్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఫామ్ పై ఉన్న ఆందోళనలు తొలగిపోయాయి. రోహిత్ శర్మ అద్భుతంగా ఆడి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ గెలుచుకోగా .. తొలి రెండు వన్డేల్లో డకౌటైనా సిడ్నీ వన్డేలో హాఫ్ సెంచరీ చేసి కోహ్లీ మంచి టచ్ లో కనిపించాడు. కేవలం ఒకటే ఫార్మాట్ ఆడడంతో వీరి ఆట కోసం ఫ్యాన్స్ ఎంతగానో ఎదురు చూస్తున్నారు. కోహ్లీ, రోహిత్ వన్డేల్లో మాత్రమే కనిపించనుండడంతో వీరి నెక్స్ట్ షెడ్యూల్ ఎప్పుడు అని అభిమానులు ఆరాటపడుతున్నారు.

2027 వన్డే వరల్డ్ కప్ వరకు రోకో జోడీ ఆడాడతారని దాదాపుగా కన్ఫర్మ్ అయింది. ఏడు నెలల తర్వాత బరిలోకి దిగినా వీరిద్దరూ తమ ఫామ్ ను కొనసాగించి విమర్శకులకు సమాధానమిచ్చారు. 2027 వన్డే వరల్డ్ కప్ లోపు ఇండియా మొత్తం 21 వన్డే మ్యాచ్ లు ఆడనుంది. ఇందులో భాగంగా మొదట సౌతాఫ్రికాతో మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్ జరగనుంది. నవంబర్ 30 న తొలి వన్డే.. డిసెంబర్ 3 న రెండో వన్డే.. డిసెంబర్ 6 న మూడో వన్డే జరుగుతుంది. తొలి మూడు వన్డేలకు వరుసగా రాంచీ, రాయ్‌పూర్,విశాఖపట్నం ఆతిథ్యమిస్తాయి. సౌతాఫ్రికాతో వన్డే సిరీస్ ముగిశాక ఇండియా వన్డే షెడ్యూల్ ఏంటో ఇప్పుడు చూద్దాం..

**2027 వరల్డ్ కప్ ముందు టీమిండియా వన్డే షెడ్యూల్:**

2025 నవంబర్,డిసెంబర్ లో దక్షిణాఫ్రికాతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను ఆడనుంది.

2026 జనవరిలో న్యూజిలాండ్‌తో మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్. ఈ ఇండియాలో ఈ సిరీస్ జరుగుతుంది.

2026 జూన్‌లో స్వదేశంలో ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల సిరీస్

2026 జూలైలో ఇంగ్లాండ్‌తో మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్ (విదేశాల్లో)

2026 సెప్టెంబర్, అక్టోబర్ లో వెస్టిండీస్‌తో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్

2026 అక్టోబర్, నవంబర్‌లో మూడు వన్డేల సిరీస్ న్యూజిలాండ్ లో జరగనుంది.

2026 డిసెంబర్ లో శ్రీలంకతో స్వదేశంలో మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్

**రోహిత్ సూపర్ హిట్.. కోహ్లీ ఫ్లాప్:**

ఆస్ట్రేలియాతో ఇటీవలే ముగిసిన మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్ లో మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అదరగొట్టాడు. తొలి వన్డేలో విఫలమైనా రెండో వన్డేలో హాఫ్ సెంచరీ చేసి రాణించాడు. సిడ్నీలో జరిగిన మూడో వన్డేలో చెలరేగుతూ సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఓవరాల్ గా ఈ సిరీస్ లో అత్యధిక పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు గెలుచుకున్నాడు. మరోవైపు కోహ్లీ తొలి రెండు వన్డేల్లో డకౌటై తీవ్రంగా నిరాశపరిచాడు. అయితే మూడో వన్డేలో హాఫ్ సెంచరీ చేసి టచ్ లోకి వచ్చాడు.

## కంబ్యాక్ అంత ఈజీ కాదు: కోహ్లీ బాటలోనే కేన్ మామ..

# 9 ఏళ్ళ తర్వాత వన్డేల్లో విలియంసన్ డకౌట్




**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్ లో విరామం తర్వాత తొలి మ్యాచ్ లోనే రాణించడం ఈజీ కాదని మరోసారి రుజువైంది. ఇటీవలే ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్ లో కోహ్లీ, రోహిత్ ఏడు నెలల తర్వాత తొలిసారి అంతర్జాతీయ మ్యాచ్ ఆడితే ఇద్దరూ విఫలమయ్యారు. రోహిత్ సింగిల్ డిజిట్ కే పరిమితం కాగా.. కోహ్లీ డకౌటయ్యాడు. ఇప్పుడు వీరిద్దరి దారినే న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ కేన్ విలియంసన్ అనుసరించాడు. సుదీర్ఘ విరామం తర్వాత అంతర్జాతీయ క్రికెట్ లోకి అడుగుపెట్టిన విలియంసన్ కు నిరాశే మిగిలింది. ఏడు నెలల తర్వాత అంతర్జాతీయ క్రికెట్ లో రీ ఎంట్రీ ఇచ్చిన కేన్ తన తొలి మ్యాచ్ లో డకౌట్ గా వెనుదిరిగాడు. ఛాంపియన్స్ ట్రోఫీ 2025 తర్వాత తొలి వన్డే ఆడిన ఈ కివీస్ దిగ్గజ క్రికెటర్ తొలి బంతికే బ్రైడాన్ కార్స్ బౌలింగ్ లో గోల్డెన్ డక్ ఔటయ్యాడు. కార్స్ వేసిన ఎక్స్ ట్రా బౌన్స్ ఆడే క్రమంలో విలియంసన్ బ్యాట్ అంచుకు బ్యాట్ తగిలి వికెట్ కీపర్ చేతుల్లో పడింది. చివరిసారిగా 2016లో వన్డే క్రికెట్ లో ఆస్ట్రేలియాపై డకౌటైన ఈ కివీస్ స్టార్ 9 సంవత్సరాల తర్వాత పరుగుల ఖాతా తెరవకుండా పెవిలియన్ చేరాడు. ఈ ఏడాది ప్రారంభంలో ఇండియాపై ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ ఆడిన కేన్.. 7 నెలల తర్వాత ఇదే తొలి అంతర్జాతీయ మ్యాచ్ కావడం విశేషం.

**సెంట్రల్ కాంట్రాక్ట్ వద్దనుకున్న విలియంసన్:**

న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు సెంట్రల్ కాంట్రాక్ట్ కేన్ వద్దనుకున్నారు. ఒకవేళ ఈ కాంట్రాక్ట్ లిస్ట్ లో ఉంటే జాతీయ జట్టు తరపున రెగ్యులర్ ప్లేయర్ గా ఆడాల్సి ఉంటుంది. విలియంసన్ మాత్రం అంతర్జాతీయ టీ20 క్రికెట్ లీగ్ లు ఆడాలనే తన కోరికను తెలిపాడు. సెంట్రల్ కాంట్రాక్ట్ లిస్ట్ లో లేకపోయినా ప్రధాన టోర్నీలకు అందుబాటులో ఉంటానని గతంలోనే కేన్ స్పష్టం చేశాడు. విలియంసన్ టీ20 వరల్డ్ కప్ 2026 ఆడతాని ప్రకటించడంతో ఫ్యాన్స్ పండగ చేసుకుంటున్నారు. పని భారాన్ని దృష్టిలో ఉంచుకొని రానున్న ఐసీసీ టోర్నీలో ఫిట్ గా ఉండేందుకు తాను ఈ నిర్ణయం తీసుకున్నానని ఈ కివీస్ దిగ్గజం చెప్పినా ద్వైపాక్షిక సిరీస్ పై ఆసక్తి చూపించడం లేదు. ఈ మ్యాచ్ విషయానికి వస్తే.. ఇంగ్లాండ్ తో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో న్యూజిలాండ్ బోణీ చేసింది. లక్ష్య ఛేదనలో డారిల్ మిచెల్ (78 నాటౌట్), మైకేల్ బ్రాస్‌వెల్ (51) హాఫ్ సెంచరీలతో రాణించడంతో.. ఆదివారం జరిగిన తొలి వన్డేలో కివీస్ 4 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. ఫలితంగా సిరీస్‌లో 1%-%0 లీడ్‌లో నిలిచింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 35.2 ఓవర్లలో 223 రన్స్‌కు ఆలౌటైంది. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (101 బాల్స్‌లో 9 ఫోర్లు, 11 సిక్సర్లతో 135) సెంచరీతో చెలరేగినా మిగతా బ్యాటర్ల నుంచి సహకారం దక్కలేదు.జెమీ స్మిత్ (0), బెన్ డకెట్ (2), జో రూట్ (2), జాకబ్ బెథెల్ (2), బట్లర్ (4), సామ్ కరన్ (6) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. బ్రూక్, జెమీ ఓవర్టన్ (46) ఏడో వికెట్‌కు 87 రన్స్ జోడించారు. ఛేజింగ్‌లో కివీస్ 36.4 ఓవర్లలో 224/6 స్కోరు చేసి నెగ్గింది. విల్ యంగ్ (5), రచిన్ రవీంద్ర (17), కేన్ విలియమ్సన్ (0) ఫెయిలయ్యారు. టామ్ లాథమ్ (24), మిచెల్ శాంట్నర్ (27) పర్వలేదనిపించారు. బ్రైడన్ కార్సీ 3 వికెట్లు తీశాడు. బ్రూక్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఇరుజట్ల మధ్య రెండో వన్డే బుధవారం హామిల్టన్‌లో జరుగుతుంది.

# టీమిండియాతో టెస్టు సిరీస్ కు దక్షిణాఫ్రికా జట్టు ప్రకటన

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్‌తో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ దక్షిణాఫ్రికా తమ జట్టును ప్రకటించింది. గాయం కారణంగా గత కొంతకాలంగా జట్టుకు దూరమైన టెంబా బవుమా, కెప్టెన్‌గా పునరాగమనం చేశాడు. ఈ సిరీస్‌లోని తొలి టెస్టు నవంబర్ 14న కోల్‌కతాలోని ప్రఖ్యాత ఈడెన్ గార్డెన్స్ మైదానంలో ప్రారంభం కానుంది. ఇటీవలే పాకిస్థాన్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కు బవుమా పిక్క కండరాల గాయం కారణంగా దూరమయ్యాడు. అతని గైర్హాజరీలో ఐడెన్ మార్క్రమ్ జట్టుకు నాయకత్వం వహించగా, ఆ సిరీస్‌ను సఫారీ జట్టు 1-1తో డ్రా చేసుకుంది. తాజాగా ప్రకటించిన జట్టులో డేవిడ్ బెడింగ్‌హామ్ స్థానంలో బవుమాను ఎంపిక చేశారు. భారత పర్యటనలో స్పిన్ కీలక పాత్ర పోషించనుండటంతో దక్షిణాఫ్రికా తమ జట్టులో కేశవ్ మహారాజ్, సైమన్ హార్మర్, సెనురన్ ముత్తుస్వామి వంటి స్పిన్నర్లకు ప్రాధాన్యం ఇచ్చింది. పేస్ విభాగంలో కగిసో రబాడతో పాటు ఆల్‌రౌండర్లు కార్బిన్ బాష్, మార్కో యన్సెన్, వియాన్ ముల్డర్ ఉన్నారు. ఈ సిరీస్‌లో భాగంగా తొలి టెస్టు నవంబర్ 14న కోల్‌కతాలో, రెండో టెస్టు నవంబర్ 22న గౌహతిలోని ఏసీఏ స్టేడియంలో జరగనుంది. గౌహతి మైదానానికి ఇదే తొలి టెస్ట్ మ్యాచ్ కావడం విశేషం. ఈ పర్యటనకు ముందు, నవంబర్ 2 నుంచి బెంగళూరు వేదికగా జరిగే భారత్ 'ఏ' జట్టుతో సిరీస్‌లో కూడా బవుమా ఆడనున్నాడు. ఇదే సిరీస్‌లో టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్ కూడా పాదం గాయం నుంచి కోలుకుని తిరిగి మైదానంలోకి అడుగుపెట్టనున్నాడు.

జట్టు ఎంపికపై దక్షిణాఫ్రికా హెడ్ కోచ్ షుక్రి కాన్రాడ్ మాట్లాడుతూ, "పాకిస్థాన్‌తో సిరీస్‌లో ఆడిన జట్టులోని చాలా మంది ఆటగాళ్లను కొనసాగించాం. వారు అద్భుతమైన పోరాట పటిమను ప్రదర్శించి సిరీస్‌ను డ్రాగా ముగించారు. భారత్‌లో కూడా మాకు అలాంటి కఠిన సవాలే ఎదురవుతుందని భావిస్తున్నాం. పాక్‌లో రాణించిన ఆటగాళ్లు ఇక్కడ కూడా కీలకం కానున్నారు. ఇది కచ్చితంగా జట్టు సమష్టి కృషితోనే సాధ్యమవుతుంది" అని వివరించారు.

**భారత్‌తో టెస్టులకు దక్షిణాఫ్రికా జట్టు:**

టెంబా బవుమా (కెప్టెన్), ఐడెన్ మార్క్రమ్, ర్యాన్ రికెల్టన్, ట్రిస్టన్ స్టబ్స్, కైల్ వెర్రెయిన్, డెవాల్డ్ బ్రెవిస్, జుబేర్ హమ్జా, టోనీ డి జోర్జి, కార్బిన్ బాష్, వియాన్ ముల్డర్, మార్కో జాన్సెన్, కేశవ్ మహారాజ్, సెనురాన్ ముత్తుస్వామి, కగిసో రబాడ, సైమన్ హార్మర్.

# గ్యాంగ్‌స్టర్‌గా సవాల్‌ను స్వీకరిస్తాడా?



జాన్వీ కపూర్ ఫ్యాషన్ మీరు స్టార్లను చూస్తారు

సత్య .. గ్యాంగ్ స్టర్ .. గ్యాంగ్స్ ఆఫ్ వాసేపూర్ ..ఇంకా చాలా గ్యాంగ్ స్టర్ డ్రామాలు బాలీవుడ్ లో వచ్చాయి. ఇవన్నీ వేటికవే ప్రత్యేకం అని నిరూపించాయి. ఈ సినిమాల్లో నటీనటుల ప్రదర్శనలు పరాకాష్టలో మెప్పించాయి. అందుకే ఇప్పుడు మరోసారి గ్యాంగ్ స్టర్ డ్రామాను ఎంపిక చేసుకుంటే, దానిలో ప్రధాన పాత్రధారి కొత్తదనం, వైవిధ్యం ప్రదర్శించడంలో సత్తా చాటాల్సి ఉంటుంది. షారూఖ్ డాన్ లో అండర్ వరల్డ్ కింగ్ గా నటించి మెప్పించాడు. ప్రస్తుతం సిద్ధార్థ్ ఆనంద్ - కింగ్ - చిత్రంలో మరోసారి మాఫియా డాన్ గా నటిస్తున్నాడు.

ఇలాంటి సమయంలో ఒక నవతరం హీరో అండర్ వరల్డ్ లో ప్రవేశించే యువకుడిగా, పరిణతి చెందిన డాన్‌గా భిన్నమైన షేడ్స్ లో నటించాలంటే చాలా సవాళ్లను స్వీకరించాలి. నటనలో కొత్తదనం చూపించాలి. కథ, కథనంలో మేకర్స్ కొత్తదనం ఆవిష్కరించాలి. ముఖ్యంగా ఎమోషన్స్ ని కనెక్ట్ చేసే ఎలిమెంట్స్ ని జోడించాల్సి ఉంటుంది. ఎక్కడ ఏది సింక్ కాకపోయినా అది మిస్ ఫైర్ అవ్వడం ఖాయం.

కానీ ఇలాంటి ఒక సవాల్ ని స్వీకరించేందుకు నవతరం హీరో హర్షవర్ధన్ రాణే సిద్ధమవుతున్నాడు. అతడు ఇప్పటివరకూ రొమాంటిక్ కామెడీలతో ఆకట్టుకున్నాడు. సనమ్ తేరి కసమ్, ఏక్ దీవానే కి దీవానియాత్ చిత్రాలతో నటుడిగా తన ప్రత్యేకతను చాటుకున్నాడు రాణే. ఈ రెండు చిత్రాలు ప్రేమకథలు.. రొమాన్స్, కామెడీ, ఎమోషన్స్ నేపథ్యంలో రక్తి కట్టించాయి. కానీ ఇప్పుడు హర్షవర్ధన్ పూర్తిగా ఒక భిన్నమైన ప్రపంచంలోకి అడుగుపెట్టాల్సి ఉంటుంది. అండర్ వరల్డ్ మాఫియా పాత్ర అతడికి పూర్తిగా కొత్త. ఇది ఒక సవాల్.

ఇది తన కెరీర్ లో ఒక సాహసంగానే చూడాలి. డాన్ పాత్రలో మునుపెన్నడూ చూడని కొత్తదనాన్ని చూపించేందుకు అతడు చాలా శ్రమించాల్సి ఉంటుంది. ఒక రొటీన్ ప్రేమికుడిగా లేదా భగ్న ప్రేమికుడిగా కనిపించినంత సులువుగా డాన్ పాత్రలోకి ఒదిగిపోవడం కుదరదు. కానీ నటుడిగా కొత్త దశకు చేరాలంటే ఇలాంటి ఒక ప్రయత్నం చేయాలి. హర్షవర్ధన్ రొటీన్ కి భిన్నంగా ఒక డాన్ గా ఎలా పరివర్తన చెందుతాడో వేచి చూడాలి. ఈ ప్రతిష్ఠాత్మక గ్యాంగ్ స్టర్ డ్రామాను బాలాజీ టెలీఫిలింస్ అధినేత్రి ఏక్తాకపూర్ నిర్మించనున్నారు. ఒక అన్ నోన్ ప్రపంచం నుంచి అండర్ వరల్డ్ లోకి ప్రవేశించే యువకుడి భావోద్వేగాలను వెండితెరపైకి తీసుకు రావాలనే ప్రయత్నమిది. ఇది ఒక రకంగా ఆర్జీవీ సత్య స్టోరి లైన్ ని పోలి ఉంటుంది. కానీ ఇప్పుడు దానికి మించి మోడ్రన్ యుగపు డాన్‌గా హర్షవర్ధన్ పరిణతి చెందిన నటనను కనబరచాల్సి ఉంటుంది. తనకు సంబంధం లేకుండానే అండర్ వరల్డ్ లో ప్రవేశించే యువకుడిగా హర్షకు నటించేందుకు ఎక్కువ స్కోప్ ఉంది. కానీ అతడు ఏం చేస్తాడో వేచి చూడా.

హర్షవర్ధన్ తదుపరి %-%సిలా%-% చిత్రంలో సాదియా ఖతీబ్, కరణ్ వీర్ మెహ్రాతో కలిసి కనిపిస్తాడు. ఆ తర్వాత ఏక్తాకపూర్ నిర్మించే గ్యాంగ్ స్టర్ డ్రామా కోసం ప్రిపేర్ అవుతాడు. భూమిక నిర్మించిన తెలుగు సినిమా తకిట తకిట నుంచి హర్షవర్ధన్ రాణే ప్రయాణం ఆసక్తికరం. అతడు బాలీవుడ్ లో పెద్ద స్టార్ గా తనను తాను ఆవిష్కరించుకునే సమయంలో ఇది అద్భుత అవకాశం.



ప్రతి లుక్‌ని ఎలా రాక్ చేయడం శ్రీముఖికి తెలుసు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at 38/291-6, Sreerama nagar colony, Near Central prison, KADAPA CITY, KADAPA DISTRICT, ANDHRAPRADESH-516002, Editor : GANTYADA APPARAO Mobile : 9059465965, RNI : APTEL/25/A2231, editorpenpower@gmail.com